## అభివృద్ధిలో వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి

అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయి. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్,రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మీ అపారమైన అనుభవం ఏమైంది?

మొదటి పేజీ తరువాయి

అమలు చేయడం లేదు? అప్పులు అప్పులు.. అంటూ ఎందుకు కుంటి సాకులు, సొల్లు పురాణం చెబుతున్నరు? కరోనా వచ్చినా ఎకానమీ డౌన్ అయినా కేసీఆర్ గారు ఏనాడూ రాష్ట్రం దివాళా తీసింది అనలేదు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి , కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోంది'' అని విమర్శించారు.

## ఐదో విడత రైతు భరోసా నిధులు విడుదల

మొదటి పేజీ తరువాయి

ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.78 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. అర్హులైన ప్రతి రైతుకు దశలవారీగా రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తులకు సాగు పెట్టుబడి భారాన్ని తగ్గించి, వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. మిగిలిన అర్హులైన రైతులకు కూడా త్వరలోనే తదుపరి విడత నిధులను విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## తెలంగాణ విధానాలు దేశానికే ఆదర్శం

మొదటి పేజీ తరువాయి

విధానం బలోపేతం వంటి చర్యలు తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ పర్యాటక విధానం–2025 – 2030 ఇప్పటికే విశేష ఫలితాలను ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు మార్గం సుగమమైందని తెలిపారు. గతంలో కూడా తెలంగాణ పర్యాటక రంగంలోని పలు ఉత్తమ కార్యక్రమాలు, పర్యాటక ప్రాంతాలకు నీతి ఆయోగ్ నివేదికల్లో స్థానం దక్కిందని మంత్రి గుర్తు చేశారు. తాజాగా మరోసారి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణను ఆదర్శంగా పేర్కొనడం రాష్ట్ర పర్యాటక రంగం సరైన దిశలో ముందుకు సాగుతోందనడానికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన విధానాలు అమలు చేస్తూ, ప్రపంచ స్థాయి పర్యాటక మౌలిక వసతులు కల్పించి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

## హర హర మహాదేవ్

మొదటి పేజీ తరువాయి

హిమాలయాల్లో ఏటా ఈ సమయంలో ఏర్పడే మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నువ్వాన్, బాల్‌టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలు బయలుదేరాయి. శుక్రవారం దర్శనం చేసుకున్నవారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. యాత్ర మొదలైన నేపథ్యంలో భక్తులకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా రెండు పేజీల లేఖ రాశారు. ఈ సందర్భంగా అయిదు ప్రతిజ్ఞలు చేయాలంటూ వారికి సూచించారు. పరిశుభ్రత పాటించటం.. జమ్మూకశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం.. ట్రాఫిక్ నిబంధనలు.. పచ్చదనాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రక్షాబంధన్ రోజు తోబుట్టువులకు బహుమతిగా మొక్కలు.. దేశం ప్రథమం అనే నినాదంతో అమరనాథ్ యాత్రను సాగించాలని భక్తులను ప్రధాని కోరారు.

## విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**చిల్డ్రన్ హోమ్ చిన్నారులకు డీఎల్ఎస్ఏ సెక్రటరీ శ్రీదేవి పిలుపు**

**నాగర్ కర్నూల్, జులై 4 (వుదయం బ్యూరో):** జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, అందరూ చక్కగా చదువుకొని గొప్ప స్థాయికి చేరుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఏ. శ్రీదేవి చిన్నారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని జ్ఞానేశ్వర వాస్తల్య మందిరం చిల్డ్రన్ హోమ్ (బాలురు)ను డీఎల్ఎస్ఏ సెక్రటరీ శ్రీమతి ఏ. శ్రీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందిస్తున్నారా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వసతి, చదువు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. చిన్నారులచే పాటలు పాడించి వారిలో ఉత్సాహం నింపారు. 'మీకు ఏమైనా న్యాయపరమైన, ఇతర సహాయం కావాలంటే మా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తాం. కష్టపడి చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి' అని చిన్నారులకు శ్రీదేవి భరోసా ఇచ్చారు. నంతరం చిన్నారులకు అరటి పండ్లు, బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## కొడకంచి పాఠశాలలో తనిఖీ

**– హాజరైన సెంట్రల్ సామాజిక తనిఖీ అధికారి విక్రమ్ గౌడ్**

**జిన్నారం జులై 4(వుదయం ప్రతినిధి) :** జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆడిటర్లు సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సెంట్రల్ సామాజిక తనిఖీ అధికారి విక్రమ్ గౌడ్ సమగ్ర తనిఖీలో భాగంగా కౌన్సిలర్లు ఉపాధ్యాయులను విద్యార్థులను ప్రశ్నించారు. ఆరు ఏడవ తరగతి గదుల కొరత తో పాటు లైబ్రరీ సైన్స్ ల్యాబ్లు కొరతగా ఉన్నాయని, బాలురు బాలికలకు మూత్రశాలలు సరైన విధంగా లేవని తనిఖీలో పేర్కొన్నారు. పాఠశాలకు తాగునీటి సమస్య కూడా నెలకొంది ఉందని విన్నవించారు. పాఠశాల గ్రాండ్ లు పుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫామ్ లు తదితర విషయాలతో పాటు మౌలిక సదుపాయాల గురించి అధికారి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సంబంధించి విద్యా వైద్యం పౌష్టికాహారం తదితర విషయాలపై విద్యార్థులతో మాట్లాడి అధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీలత నాయకులు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ గౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కేసీఆర్‌కు 1000 ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది?



**నాగర్‌కర్నూల్, జూన్ 24 (వుదయం ప్రతినిధి) :** దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చని.. పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా? అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తట్ట పనికి, మట్టి పనికి మనమే కావాలి.. కానీ, పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి, విత్తనానికి మధ్య బంధం ఎలా ఉంటుందో.. పేదవాడికి, పాలన చేసేవాడికి మధ్య అదే బంధం ఉంటుందని పేర్కొన్నారు. అహంకారులకు బుద్ధి చెప్పాలా? వద్దా? అని ప్రశ్నించారు. దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చని.. పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా? తట్ట పనికి, మట్టి పనికి మనమే కావాలి.. కానీ, పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.గద్దర్ అన్నను గడీ ముందు నిలబెట్టినవారికి ఉరిశిక్ష వేసినా తక్కువే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మిడ్జిల్‌లో శనివారం కృతజ్ఞత సభ జరిగింది. సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబంలో వారికే పదవులు వచ్చాయి. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టండి. రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? ఉచిత కరెంట్ ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించినందుకు ప్రజాపాలన పోవాలా?.. మీ దోపిడీకి అడ్డుకట్ట పడినందునే.. ప్రజాపాలన పోవాలని కోరుకుంటున్నారు. ప్రతి దాంట్లో కమీషన్లు తిన్నారు. బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు'. కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు పెరిగితే.. తెలంగాణకు అప్పులు మాత్రమే మిగిలాయి. కేసీఆర్ కుటుంబంలో అందరికీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. సమస్యలపై ప్రతిపక్ష నేత మాట్లాడరంట. అధికారం ఇస్తే దోచుకోవడానికి మాత్రం వస్తారట. వాళ్లు దోచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఆలోచించాలి. అరుంధతి సినిమాలో పశుపతిలా.. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్ లో బంధించాం. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ బయటికొచ్చే పరిస్థితి లేదు. బీఆర్ఎస్‌కు అధికారం అన్నది కలే. బీఆర్ఎస్‌కు గతం తప్ప భవిష్యత్ లేదు. మళ్లీ కాంగ్రెస్ రావాలి. రాహుల్ ప్రధాని కావాలి. రాహుల్‌ను ప్రధానిగా చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది' అని అన్నారు.

## ప్రజల భద్రతే ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ, కేంద్ర జల సంఘం, అంతర్జాతీయ నిపుణులు కలిసి పునరుద్ధరణ నమూనాలను పరిశీలిస్తున్నారని, భద్రతపై పూర్తి నమ్మకం వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.నాగార్జునసాగర్ డ్యామ్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం నాగార్జునసాగర్ డ్యామ్ భద్రత, నిర్వహణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అవసరమైన అన్ని మరమ్మతుల అంచనాలను వెంటనే సిద్ధం చేసి పరిపాలనా అనుమతులకు పంపాలని అధికారులను ఆదేశించారు. లైనింగ్ అవసరమైన కాలువలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల గుండా వెళ్లే ఓపెన్ కాలువలను దశలవారీగా కప్పివేసే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. దీనివల్ల చెత్త వేయడాన్ని అరికట్టడంతో పాటు పరిశుభ్రత మెరుగుపడుతుందని చెప్పారు. ప్రతి సాగునీటి పనిలో నాణ్యత, వేగం అనే రెండు అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోనే పనులు పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. అంతకుముందు మిర్యాలగూడలో ఎగుమతులకు అనువైన ఆధునిక రైస్ మిల్లును మంత్రి ప్రారంభించారు. అనంతరం గుల్లపోతులగండి, కేశవాపూర్, నెల్లికల్లు ఎత్తిపోతల పథకాల పనులను పరిశీలించి, వాటిని వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపే దిశగా అధికారులు పనిచేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంజయ్ జాజు**

**గద్వాల జూలై 04 (వుదయం బ్యూరో) :** ప్రతి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపే దిశగా అధికారులు లక్ష్యబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన



కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, వైద్య ఆరోగ్య సేవలు, విద్యా రంగం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రానున్న ఆరు నెలల్లో ప్రతి జిల్లాలో అభివృద్ధిలో గణనీయమైన మార్పు కనిపించేలా అధికారులు లక్ష్యబద్ధ కార్యాచరణతో పని చేయాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించే విధంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని తెలిపారు. ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి దోహదపడే వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణాత్మక కార్యక్రమాలతో అధికారులు ముందుకు రావాలని అన్నారు. త్వరలో జిల్లాలను సందర్శించి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. జిల్లాల్లో నమోదవుతున్న వర్షపాత పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాభావం లేదా అధిక వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కాంటింజెన్సీ క్రాప్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలన్నారు. రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించాలని సూచించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్, అనంతరం అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



చుడీబాజర్ లో నేడు అరుంధతీ సేవా కమిటీ కేంద్ర మండలి జరుగనున్న ఎన్నికల వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల చైర్మన్ రవీందర్, వైస్ ఛైర్మన్ పాలెం వెంకటేశ్, సభ్యులు డి యాదయ్య, జెన్ను శ్యామ్, మిఠకడప లక్ష్మీనారాయణ, దేవేందర్ లు శనివారం విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# సర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం ''సర్'' ను ఉపయోగించుకుని హిందువల ఓట్లను తొలగించేందుకు పెద్ద ఎత్తున కుట్ర చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. సర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు సహకరించడం లేదన్నారు. ఫలితంగా అధికారులు క్షేత్రస్థాయిలో హిందువుల ఇండ్లకు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదన్నారు. తెలంగాణలోని హిందువులంతా జాగ్రుతం కావాలని, లేనిపక్షంలో తెలంగాణలో హిందువులంతా మైనారిటీలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈరోజు వేములవాడ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. అందులో భాగంగా కాచారం గ్రామంలో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. మరో 10లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దమ్మన్నపేట గ్రామంలో 8 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దేశాయ్ పేట్ లో 9 లక్షల రూపాయల MP లాడ్స్ నిధులతో నిర్మించిన బస్టాండ్ ను ప్రారంభించారు. మరో 36 లక్షల వ్యయంతో నిర్మించిన CC రోడ్డు ప్రారంభించారు. మన్నెగూడెంలో 10 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇక కథలాపూర్ మండలం విషయానికొస్తే... గంబీర్ పూర్ లో 4 లక్షల 50 వేల వ్యయంతో సీసీ డ్రెయిన్, పోసానిపేటలో 5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, దూంపేటలో 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమారం మండలం దేశాయ్ పేటలో మీడియాతో మాట్లాడారు. గిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గం మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడానికి రావడం సంతోషంగా ఉంది. ఏ ప్రాంతం బాగుపడాలన్నా ముందు రవాణా సౌకర్యాలు బాగుంటేనే సాధ్యమవుతుంది. అందుకే నేను ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు అత్యధిక ప్రాధాన్యత రోడ్ల నిర్మాణానికే ఇచ్చాను. మోదీ గారి ఆశీస్సులు, నితిన్ గడ్కరీ గారి సహకారంతో గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి సడక్ యోజన, సిఆర్ఎఫ్ నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణ కోసమే ఎక్కువ నిధులు తీసుకొచ్చిన. కేవలం జాతీయ రహదారుల విస్తరణ కోసమే 5 వేల కోట్ల రూపాయలు తీసుకొచ్చినం. దీంతోపాటు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి మిగిలిన నిధులు తీసుకొచ్చి ఖర్చు చేస్తున్నం. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో ఎంపీగా పనిచేసిన ఏ నాయకుడు కూడా ఈ స్థాయిలో నిధులు తీసుకువచ్చిన దాఖలాలు లేవు. అందులో భాగంగా 2 వేల 147 కోట్లు నిధులతో కరీంనగర్–వరంగల్ నేషనల్ హైవే పనులను పూర్తి చేసుకుని దసరా నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. అట్లాగే 578 కోట్ల రూపాయలతో ఎల్కతుర్తి-సిద్దిపేట నేషనల్ హైవే పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. ఈ ప్రాంత చిరకాల వాంఛ అయిన కరీంనగర్, జగిత్యాల హైవే విస్తరణ పనులను ప్రారంభించుకోబోతున్నాం. 2 వేల 3 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులను సైతం పెద్ద ఎత్తున కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చిన. గతంలో తెలంగాణ మొత్తానికి 800 కోట్ల సీఆర్ఎఫ్ నిధులు మంజూరైతే... అందులో ఒక్క కరీంనగర్ పార్లమెంట్ కే 291 కోట్లు తీసుకొచ్చి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించిన ఘనత సాధించినం. అట్లాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద (వచ్చే జులై 1 నుండి వీబీజీ రామ్ జీ స్కీంగా పేరు మారబోతోంది) రోడ్ల నిర్మాణం కోసమే దాదాపు వెయ్యి కోట్ల దాకా ఖర్చు చేసుకున్నం. గ్రామీణ సడక్ యోజన పథకం కింద వందలాది కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించినం. ఎన్నికలప్పుడే రాజకీయాలు. ఎన్నికల తరువాత నా ధ్యాస, శ్వాస అంతా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఇంకా పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా. గ్రామగ్రామాన, గల్లీగల్లీలో రోడ్లు వేయిస్తా. రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకుంటూ పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తా. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే వివక్ష లేకుండా ఓటేసిన ప్రజల ఆకాంక్ష మేరకు చేయి చేయి కలుపుదాం... వేములవాడ, సిరిసిల్లసహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం. కలిసి రావాలని అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులను, నాయకులను కోరుతున్నా...

**అప్పులు, అవినీతి, అక్రమాలు తప్ప ఆ రెండు పార్టీలు చేసిందేమిటి?**

ఇయాళ పేపర్లలో చూసిన బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 8 లక్షల 21 వేల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ రెండున్నరేళ్లలో 1 లక్షా 77 వేల కోట్లు అప్పు చేసిందట. రాష్ట్ర ఆర్థిక మంత్రే ఈ లెక్కలు చెప్పారు. అంటే ఇద్దరూ కలిసి 10 లక్షల కోట్ల అప్పును తెలంగాణ ప్రజలపై మోపారు. ఇంత అప్పు చేసి ఏం చేశారంటే... చేసిందేమీ లేదు. ఇయాళ జీతాలు, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలంటే కూడా పైసల్లేని దుస్థితి ఏర్పడింది. రెండు పార్టీల 12 ఏళ్లలో చేసిందేమిటంటే... అప్పులు, అవినీతి, అక్రమాలు మాత్రమే. బీఆర్ఎస్ పాలనలో దోచుకున్న సొమ్మునంతా ఫాంహౌజ్ కు తరలిస్తే... కాంగ్రెస్ పాలనలో దోచుకున్నదంతా ఢిల్లీకి పెద్దలకు మూటలు పంపుతున్నారు.

**వీబీజీ రామ్ జీపై కోర్టుకు వెళ్లడమేంది?**

వీబీజీ రామ్ జీ పథకంతో పనిదినాలు పెంచి ఆస్తులు సృష్టించడం తప్పా. దీనిపై కోర్టుకు వెళ్లడం ఏంది?. మోదీకి మంచి పేరొస్తే ఓర్వలేరా?. సర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోంది. హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఏర్పడింది. అధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదు. మజ్లిస్ తో కుమ్మక్కై కాంగ్రెస్ హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది.

**రేవంత్ కు శుభాకాంక్షలు..** కష్టపడి పనిచేసి క్షేత్రస్థాయి నుండి ఎదిగే లీడర్ ను సమాజం గౌరవిస్తుంది. అందులో భాగంగా 20 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు. కేసీఆర్ కూడా కష్టపడి పైకొచ్చిన నాయకులే. కానీ ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని కోరుతున్నానన్నారు.

## ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలి

**హైదరాబాద్, జులై 4 (వుదయం ప్రతినిధి) :** దక్షిణ భారతదేశంలో ఏకైక ప్రధాన బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రానున్న రోజుల్లో తన సేవలను మరింత విస్తృత పరచాలని, కొత్త గనులు సాధించి పెరుగుతున్న దేశ ఇంధన అవసరాలకు తోడ్పాటును అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్లోని సింగరేణి భవన్లో ఆయన సింగరేణి సంస్థ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సింగరేణి గనుల ఉత్పత్తి, రవాణా, ఓవర్ బారదేన తొలగింపునకు సంబంధించిన వివరాలను కొత్త గనులు వాటి ఉత్పత్తి వివరాలు, అనుమతుల స్థితిగతులపై గనుల వారీగా కూలంకశంగా సమీక్షించారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి పెంచడం కోసం అవసరమైన కొత్త బ్లాక్ల ను బొగ్గు శాఖ నిర్వహించే వేలం పాటలో పాల్గొని సాధించాలని సూచించారు. దేశంలో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రానున్న 10 నుంచి 15 సంవత్సరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. దేశ ఇంధన రంగంలో ఇంకా సుదీర్ఘ కాలం బొగ్గు కీలక పాత్ర పోషించనున్నదని కనుక బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచడంపై దృష్టి సారించాలని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ, పని సామర్థ్యాన్ని మరింతగా పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. సంస్థ వాణిజ్యపరమైన విజయాలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

నేటి పోటీ మార్కెట్ లో ప్రభుత్వ సంస్థలు నిలబడాలంటే నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడంతోపాటు ప్రతీ ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కనుక కార్మికులకు సంస్థ



స్థితిగతులపైన సరైన అవగాహన కలిగించడానికి కృషి చేయాలన్నారు. కంపెనీ అభివృద్ధికి, సంస్కరణల అమలుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించుకోవాలన్నారు. సమష్టిగా సింగరేణి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని. సంస్థ అభివృద్ధికి తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**బొగ్గు గ్యాసిఫికేషన్పై దృష్టి సారించాలి**

దేశంలో కోల్ గ్యాసిఫికేషన్కు విస్తృత అవకాశాలు ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దక్షిణ భారత దేశంలో ఉన్న ఏకైన ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా ప్రారంభ దశలో చిన్న స్థాయిలో అయినా కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు చేపట్టడంపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఫెర్టిలైజర్స్ తదితర పరిశ్రమలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటానికి కోల్ గ్యాసిఫికేషన్ కు పూనుకోవాలన్నారు.

ఎల్నినో ప్రభావానికి ముందస్తు ప్రణాళిక అవసరం ప్రపంచ వ్యాప్తంగా మరియు భారత దేశంలో ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో వ్యవసాయ, ఇతర పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం తీవ్రంగా పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ ఉత్పాదనకు తగినంత బొగ్గు అందించడానికి కోలిండియా తోపాటు సింగరేణి కూడా సంసిద్ధంగా ఉండాలని శ్రీ జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ అవసరాలు పెరగనున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ముందుగానే బలోపేతం చేసి విద్యుత్ ఉత్పత్తికి నిరంతర ఇంధన సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి పెంపుకు అనుగుణంగా రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. రవాణా కాంట్రాక్టులను అత్యంత వేగంగా ఖరారు చేసి అమలు చేయడం ద్వారా అదనపు ఉత్పత్తి సకాలంలో వినియోగదారులకు చేరేలా చూడాలని సూచించారు. సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్, సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ కస్సి, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ పంకజ్ జైన్, బొగ్గు శాఖ సలహాదారులు శ్రీ వీరా రెడ్డి, సింగరేణి డైరెక్టర్లు శ్రీ ఎల్ వి సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు, ఈడీ(కోల్ మూవ్మెంట్)బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కడ నిర్మించిన ఆసుపత్రి ని దేవాలయం గా భావిస్తున్నా: హరీశ్ రావు

**శ్రీ సత్య సాయి సంజీవని ఆసుపత్రిలో గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ల అందజేత**

**కొండపాక ప్రతినిధి, జూన్ 4 (వుదయం ప్రతినిధి) :** సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోగల శ్రీ సత్య సాయి సంజీవని హార్ట్ కేర్ హాస్పిటల్ లో 500 చిన్నారులకు విజయవంతంగా గుండె ఆపరేషన్లు చేసి వారికి ప్రాణాలను నిలబెట్టిన సందర్భంగా గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ ప్రధానం చేయడంలో భాగంగా శనివారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు,సినీ నటుడు విజయ్ దేవరకొండ హాజరయ్యారు.ఇందులో భాగంగా డాక్టర్ సీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో గవర్నమెంట్ హాస్పిటల్లో ఫ్రీగా అందించలేని గుండె సంబంధిత జబ్బులకు అన్ని సౌకర్యాలతో మన సంజీవని హాస్పిటల్ లో ఫ్రీగా చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్న పిల్లలకు సంబంధించిన గుండె సంబంధిత సేవ చేస్తు, వారి మోహాల్లో చిరునవ్వు చూస్తునందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం హాస్పిటల్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయి పాదాలకు నమస్కరిస్తూ ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కు అలాగే తెలుగు హీరో విజయ్ దేవరకొండ కు ప్రత్యేక ధన్యవాదాలు అంటూ తెలిపారు.కేవలం తెలుగు ప్రజలే కాకుండా దేశమంతా ప్రేమిస్తున్న హీరో విజయ్ దేవరకొండ అన్నారు. 500 పిల్లాల హార్ట్ సర్జరీ పూర్తి కావడానికి ఆ పరమేశ్వరుడి దయ, శ్రీ సత్య సాయి కరుణా కటక్షాలే కారణమన్నారు, ఇక్కడ తెలంగాణాలో ఈ ఆసుపత్రి నెలకొల్పడానికి ముఖ్య కారకుడు మన హరీష్ రావు అన్నారు. మా ఏరియాలో చిన్నపిల్లల గుండె సంబంధిత జబ్బులకు సరైన చికిత్స లేనందున మీ సేవలు ఇక్కడ అవసరం అని తెలుపుతూ, ఆసుపత్రి నిర్మాణంలో ఎనలేని సహాయాలు అందించారని తెలిపారు. ఇక్కడ ఈ ఆసుపత్రి నిర్మించడం ఒక ఎత్తు అయితే ఇందులో పని చేసే డాక్టర్లు, నర్స్ లు ఇతర టెక్నీషియన్స్ అందరు వాళ్ళు చేసే సేవలకు మనం ఎంత చేసినా తక్కువే అని మానవ రూపంలో ఉన్న దేవుళ్ళతో సమానం వీళ్ళు అన్నారు. మానవ శరీరంలోనే గుండె అత్యంత ముఖ్యమైన



భాగం అని దానికి చికిత్స అందించడంకన్నా కార్యం ఇంకోటి లేదన్నారు. అలాగే ఇక్కడ చికిత్స పొందిన చిన్నారులు భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడతారు, దేశానికి ఏ రకంగా సహాయపడతారు, ఏ సేవలు అందిస్తారో అనేది ఆ సత్య సాయి కృపాకటాక్షమే అన్నారు. ఈ సత్య సాయి సంజీవిని అనేది ఆసుపత్రి కాదు దైవ సన్నిధితో సమానం అన్నారు. వైద్యో నారాయణ అని పెద్దలు ఏనాడో చెప్పారు, మాధవసేవయే మానవసేవ అన్నట్టుగా చిన్నపిల్లలకు చేసే సేవనే నారాయణునికి చేసే సేవతో సమానం అన్నారు. ఈ 500 పిల్లల గుండె చికిత్సలతో సరి పెట్టుకోకుండా భవిష్యత్తులో ఇంకా చాలా మంది పిల్లలకు సేవలు అందిస్తూ సిద్దిపేట జిల్లానే సేవ గుణంలో ఈ ప్రాంతాన్ని ఒక రత్నంలాగా చెప్పుకోవచ్చన్నారు. ఇంకొక గర్వకారణం ఏంటంటే ఇక్కడ పనిచేసే ప్రతి నర్సు, ప్రతి టెక్నీషియన్ సిద్దిపేట ప్రాంతవాసులు కావడం, ఇక్కడ సేవలందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ ఇక్కడ నిర్మించిన ఈ ఆసుపత్రి ఆసుపత్రిగా కాకుండా ఒక దేవాలయం గా నేను భావిస్తున్నాను అన్నారు. నామాట కాదనకుండా వచ్చి ఇక్కడ ఆస్పత్రి నిర్మించిన శ్రీనివాస్, సినీ పరిశ్రమలో మన తెలంగాణ నుండి వచ్చిన హీరో విజయ్ దేవరకొండతో పాటు ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులకు వైద్య సిబ్బందికి వారు అందిస్తున్న సేవలకు గాను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి చైర్మన్ ఈ ఒక్క హాస్పిటల్ కాకుండా మన భారతదేశంలో పదింటిని నడుపుతున్నందుకు ఆయన నిజంగా కనిపించే దేవుడని కొనియాడారు.ప్రతి సంవత్సరం 6 వేల మంది చిన్నారులకు గుండె ఆపరేషన్స్ చేయడం నిజంగా గొప్ప అన్నారు. వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడ వైద్యం పొందడానికి వచ్చిన వారి కళ్ళల్లో చూస్తున్న సంతోషం చూస్తుంటే నాకు నిజంగా గుండె ఉప్పొంగుతుంది అన్నారు. చికిత్స అందించే చిన్నారి ఒక గుండెనే కాదు వారి తల్లి దండ్రుల రెండు గుండెలతో పాటు మూడు గుండెల్ని కాపాడిన ఘనత హాస్టల్ అన్నారు. జీవితం శాస్వతం కాదు కానీ మనం చేసిన మంచి పనులే మనల్ని ప్రజల గుండెల్లో నిలబడుతాయి అన్నారు. ఇంతమంచి సేవా చేస్తున్న ఈ ఆసుపత్రికి ఒక సంవత్సర నా జీతాన్ని చెక్కు రూపకంలో అందిస్తునని తెలిపారు. ఇక్కడ కేవలం గుండె ఆపరేషన్స్ చేయడమే కాకుండా అసలు ఈ గుండె జబ్బులు ఎందుకు వస్తున్నాయి అనే కోణం లో రీసెర్చ్ సెంటర్ ను ఏర్పాటు చేసే దిశగా కూడా ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీనివాస్ తెలపడం చాలా ఆనందంగా ఉందన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రతి పౌరుడు "సర్" కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

**-బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ బిజెపి ఉపాధ్యక్షులు బండి మహేష్ యాదవ్**

మేడిపల్లి
వుదయం ప్రతినిధి జూలై 04



.ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల సవరణ కార్యక్రమం ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్ని ఒకే పోలింగ్ బూత్ లో ఉండే విధంగా చేపట్టే కార్యక్రమంలో భాగంగా శనివారం బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్లో బిజెపి ఉపాధ్యక్షులు బండి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో బూత్ నంబర్ 494 ,495 పార్వతి నగర్, బాలాజీ నగర్ కాలనీలో బిఎల్ఓ లతో కలిసి ఎస్ఐఆర్ పత్రాలను ఓటర్లకు అందజేశారు, ఈ సందర్భంగా బండి మహేష్ యాదవ్ మాట్లాడుతూ..... దేశ వ్యాప్తంగా సర్ కార్యక్రమం కొనసాగుతుందని ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మహేష్ యాదవ్ సూచించారు, డివిజన్ ప్రజలు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఓటరు వివరాల మ్యాపింగ్ను తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని మహేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు,చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత విలువైందని, ఓటరు జాబితాలో వివరాలు సక్రమంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు,డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను ధృవీకరించుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు ఉంటే వెంటనే పూర్తి చేయించుకోవాలని సూచించారు.ఓటరు జాబితాలో సరైన వివరాలు నమోదై ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని మహేష్ యాదవ్ పేర్కొన్నారు, అర్హత కలిగిన ఓటరు ఈ ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ ప్రత్యేక అవకాశాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని, యువతతో పాటు మహిళలు, వృద్ధులు కూడా తమ ఓటరు వివరాలను పరిశీలించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు కావడంతో దానిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని, ఓటరు జాబితాలో వివరాలు సక్రమంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓ) లు భాస లింగమయ్య, బొడ్డు పవన్, బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఎ) లు మహేష్ యాదవ్ రావుల మహేష్, భారతీయ జనతా పార్టీ నాయకులు చిత్తరంజన్ రెడ్డి, నమిలికొండ అనిల్ రెడ్డి, ఏనుగు శ్రీశైలం, బాలాజీ నగర్ మాజీ అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, బండి వెంకటేశ్ యాదవ్, ఆది చంద్రారెడ్డి, గోపి, నాగేంద్ర బాబు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్ కుమార్ భద్రత ఉపసంహరణ తగదు

**- మంచనపల్లి శ్రీనివాస్ జాతీయ అంబేద్కర్ అవార్డ్.**

వికారాబాద్
జులై 4 (వుదయం బ్యూరో)

మాజీ ఐపీఎస్, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు గత ప్రభుత్వం కల్పించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం మరియు భద్రత సిబ్బందిని తొలగించే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని అంబేద్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి,(మాజీ స్వేరోస్ ఇంటర్నేషనల్ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి),అంబేద్కర్ జాతీయ అవార్డ్ మంచనపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో పోలీస్ శాఖలో సేవలందించిన డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అనేక సున్నితమైన బాధ్యతలను నిర్వర్తించారని తెలిపారు.మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో పనిచేసి నక్సలైట్లను జనజీవన ప్రాంతాలకు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని ఆయనకు ఇప్పటికి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.రాష్ట్రపతి శౌర్య పతాకాన్ని అందుకున్న మాజీ ఐపీఎస్ అధికారికి గత ప్రభుత్వాలు భద్రత కల్పించాయని ప్రస్తుతం ఆ భద్రతను తగ్గించడం వెనక ఉన్న కారణాలను ప్రభుత్వం ప్రజలకు,మరియు ఉద్యోగులకు తెలియజేయాలని,ఒక్క వెళ్ల ఇట్లా తగిస్తే భవిష్యత్తులో సమశ్యఅత్మక ప్రాంతాల్లో నిక్కచ్చిగా ఉద్యోగం చెయ్యడానికి ఎవ్వరు ముందుకు రారని ,ఒక వేళ ఆర్ ఎస్ పి ని ఒక్క పార్టీ ప్రధాన కార్యదర్శిగా సూచినగాని అతనికి ఉన్న హక్కును హైకోర్టు చూపించిన విధంగా భద్రతను తగిచడం సరైంది కాదు , ప్రజాస్వామ్యానికి పూర్తికి విరుద్ధమని .గతంలో ఎంతో మంది ఎస్సీ,బీసీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థులను ఎన్నో యూనివర్సిటీలకు పంపి,ఎవరెస్ట్ శిఖరాలను అధిరోహిచడంలో మరియు స్వేరోస్ అనే ఒక్క పూర్వ విద్యార్థులతో సంఘాన్ని పెట్టి అంబేద్కర్ భావజాలాన్ని విద్యార్థులకు పరిచయం చేసి,వారికి పే బ్యాక్ సొసైటీ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ఆర్థికంగా సహాయం చెపిచడంలో ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పాత్ర ఎంతో ఉంది.అదే విధంగా ఉద్యోగులకు ట్రాన్స్ పర్ అనేది సహజం కానీ ఈ సందర్భంగా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సతీమణి లక్ష్మీ బాయికి అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ పోస్ట్ నుండి డిపార్ట్మెంట్ ఆఫ్ కోఆపరేషన్ శాఖకు బదిలీ చెయ్యడం చూస్తే అనుమానం వస్తుంది.కావున ప్రభుత్వాలు రాజ్యాగా బద్దంగా నడుచుకోవాలి,గతంలో దళిత ఐఎస్,ఐపీస్,ఆఫీసుర్లుకు ఈవిదంగా జరిగింది ఈ రోజు కూడ అదే జరిగింది. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు వారి కుటుంబనికి ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని. వెంటనే ఆయనకు బుల్లెట్ ప్రూఫ్ వాహనం,భద్రత సిబ్బందిని యధాతంతంగా కొనసాగించాలని లేనియెడల ఉద్యోగ ఉపాధ్యాయ,విద్యార్థి,గిరిజన,మైనార్టీ, స్వేరోస్, బహుజన, ప్రజాసంఘాలు,ప్రజాస్వామ్య శక్తులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని మంచనపల్లి శ్రీనివాస్ తెలియజేయడం జరిగింది.



## డ్వాక్రా సంఘం మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



బాచుపల్లి,
జులై 4,(వుదయం ప్రతినిధి ),

నిజాంపేట్ సర్కిల్, ప్రగతి నగర్ 276 డివిజన్ శ్రీ సాయి నగర్ కాలనీ బస్ స్టాండ్ సెంటర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డ్వాక్రా సంఘాలకు ఉచితంగా నాణ్యతతో కూడిన చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాకుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ప్రగతి నగర్ 276 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి) విచ్చేసి డ్వాక్రా సంఘం మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు అనుబంధ సంఘాల నాయకులకు మహిళలకు నిర్వాహకులు కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్జెల్లి మల్లికార్జున్, కూతురు ప్రవీణ్ (లడ్డు) దామరగిద్ద శేఖర్, మేడ శ్రీను, వాజిద్, రహీమ్, దుప్పటి సంతోష్, బషీర్, అబ్బు, డ్వాక్రా లక్ష్మి, గజ్జెల్లి ధనలక్ష్మి, కూతురు నిర్మల, మేదూరి విజయలక్ష్మి, చిన్న పాక చంద్రకళ, కత్తుల ప్రేమలత, మేడ రేణుక, చెరుకు నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి

**- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి**

ప్రగతినగర్,
జులై 4,(వుదయం ప్రతినిధి ),



రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రగతినగర్ డివిజన్లో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిఎంసీ, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతినగర్ 276 డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు టి నరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో ప్రగతి నగర్ పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరికల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిరికొండ శ్రీనివాస్ యువమోర్చా నాయకులు దొడ్డ పవన్, రామరాజు కాలనీ వాసులతో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కొల్లి మాధవి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ దేశంలోని అనేక రాష్ట్రాలలో తమ విజయపరంపరను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్న ఈ తరుణంలో ఎన్నో సంవత్సరాలుగా వేచి చూస్తున్న తెలంగాణ లో కూడా భారతీయ జనతా పార్టీ జెండాను ఎగరవేసే దిశగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక సమస్యలను గుర్తిస్తూ వాటిపై పోరాటం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా వివిధ కమిటీలకు చెందిన నియామక పత్రాలను కొల్లి మాధవి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులు స్వర్గీయ అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ప్రగతి నగర్ లో కాకతీయ హిల్స్ శివాజీ చౌక్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు పార్టీ నాయకులందరూ ర్యాలీగా బయలుదేరి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి భువిక్ష అల్లూరి సీతారామ రాజు వేషధారణలో పాల్గొని అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు నరేంద్ర చౌదరి, రాష్ట్ర నాయకురాలు వడ్లమూడి సులోచన, జిల్లా నాయకులు సుమన్ రావు, జక్కుల రవి యాదవ్, మందపాటి శ్రీధర్ రెడ్డి, సంతోష్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిలు మదన్మోహన్ గౌడ్, సాయి కిషోర్, ఉపాధ్యక్షులు శివ కుమార్ గుప్తా, సత్యనారాయణ, కార్యదర్శులు శ్రీమతి శనిగళ్ళ లక్ష్మి, అర్జున్, విత్తనాల సతీష్, కార్యవర్గ సభ్యులు రాహుల్, శ్రీనివాస్, యువ నాయకులు దొడ్డ పవన్, రామరాజు, శుభదీర్, సత్యనారాయణ, సూర్య ప్రకాష్,అశ్విన్, చంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరువు ఐసీడీఎస్ ప్రాజెక్టులో అంగన్‌వాడీ టీచర్, ఆయాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరువు (వుదయం):

సంగారెడ్డి జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ (ICDS) ప్రాజెక్టు పటాన్‌చెరువు పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ ఆయాల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ జయరాం నాయక్ తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారిణి, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, సంగారెడ్డి జిల్లా ఆదేశాల మేరకు మొత్తం 14 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు (అన్ని ప్రాంతాల్లో) మరియు 5 అంగన్‌వాడీ ఆయా పోస్టులు (గిరిజన ప్రాంతాలకు మాత్రమే) భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులు అర్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, రిజర్వేషన్లు తదితర పూర్తి వివరాలను మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని, ప్రత్యక్షంగా లేదా ఇతర మార్గాల్లో సమర్పించిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు.దరఖాస్తుల షెడ్యూల్: దరఖాస్తుల ప్రారంభ తేదీ: 06 జూలై 2026 చివరి తేదీ: 17 జూలై 2026 సాయంత్రం 5.00 గంటల వరకుఈ నియామక ప్రక్రియను అవసరమైతే రద్దు చేయడం, సవరించడం లేదా మార్పులు చేయడం వంటి పూర్తి అధికారాలు జిల్లా సంక్షేమ అధికారిణి/జిల్లా కలెక్టర్, సంగారెడ్డి వారికి ఉంటాయని అధికారులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు పటాన్‌చెరువు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలు తీర్చాలి

**- తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం – శంకర్‌పల్లి మండల శాఖ..**

శంకర్ పల్లి జూలై 04(వుదయం)



ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీ టి బాలకృష్ణా రెడ్డి/ (MRO) కు వినతిపత్రం శనివారం సమర్పించారు. ఈ వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల మేరకు 51% ఫిట్‌మెంట్‌తో PRC, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపు, GO190 అమలు, CPS రద్దు చేసి OPS పునరుద్ధరణ, 2003 DSC ఉపాధ్యాయులకు OPS వర్తింపు, KGBV, SSA, MTS ఉద్యోగుల సమస్యల పరిష్కారం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వేతనాల విడుదలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దారు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి,బసవరాజు మరియు మండల కార్యవర్గ సభ్యులు, జంగయ్య , కృష్ణ,శ్రీనివాస్,వెంకటేష్ ,రాజేందర్, హరిశంకర్,శ్రీకాంత్, జంగయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉద్యమకారుడి జన్మదిన వేడుకలు



జిన్నారం
జులై 4(వుదయం ప్రతినిధి)

బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు వెంకటేశం గౌడ్ జన్మదిన సందర్భంగా శనివారం కేటీఆర్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ వెంకటేశం గౌడ్ ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ తో పాటు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు వెంకటేశం గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అహర్నిశలు పార్టీ కోసమే శ్రమిస్తున్న వెంకటేశం గౌడ్ సేవలను ఈ సందర్భంగా వారు అభినందించారు. జిన్నారంలో.....తెలంగాణ ఉద్యమకారుడు జిన్నారం మున్సిపల్ టిఆర్ఎస్ నాయకులు వెంకటేశం గౌడ్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు శనివారం జిన్నారంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం ముందు జరిగిన వేడుకల్లో కార్యకర్తల సమక్షంలో వెంకటేశం గౌడ్ గులాబీ కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జైనుల్లావుద్దీన్‌కు డీసీసీ కీలక బాధ్యతలు

**- పామెన భీమ్ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎజాస్.. శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు**
**- పార్టీ బలోపేతమే లక్ష్యం.. అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపిన ఎజాస్**

శంకర్‌పల్లి,
జూలై 4 (వుదయం):



రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) జనరల్ సెక్రెటరీగా శంకర్‌పల్లి మాజీ ఎంపీటీసీ ఎండి జైనుల్లావుద్దీన్ (ఎజాస్) నియమితులు కావడం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చిన ఎజాస్‌కు పార్టీ అధిష్ఠానం ఈ కీలక బాధ్యతలను అప్పగించడం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నియామకం కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఎజాస్ శనివారం చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పామెన భీమ్ భరత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్‌లను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా భీమ్ భరత్ దంపతులు ఎజాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.అనంతరం ఎజాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంగా పనిచేస్తానని, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎజాస్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఆయనకు అప్పగించిన కొత్త బాధ్యతలతో శంకర్‌పల్లి మండలంతో పాటు చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## శంకర్ పల్లి మండల కుమ్మర సంఘం అధ్యక్షుడిగా కుమ్మర వెంకటేశం



శంకర్ పల్లి జూలై 4(వుదయం )

శంకర్పల్లి మున్సిపల్ లోని మల్లికార్జున ఫంక్షన్ హాల్లో మండల కుమ్మర కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల కుమ్మర సంఘం అధ్యక్షుడిగా శంకర్పల్లి మున్సిపల్ కు చెందిన పత్తేపురం కుమ్మర వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్న సంఘ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా కుమ్మర సంఘం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని మరియు కుమ్మర కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా పాండు, బాలరాజ్,లక్ష్మణ్, కోశాధికారిగా పాండు, ప్రచార కార్యదర్శులుగా రాజు, వాసు, కార్యదర్శులుగా ఆంజనేయులు, పరమేష్,ముత్యాలు, గౌరవాధ్యక్షులుగా నారాయణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.మండల కుమ్మర సంఘం యూత్ అధ్యక్షుడిగా వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా రాజు ఎంపికయ్యారు,ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కుమార్, వెంకటేష్,రఘు, వెంకటేశం,మహేష్ తదితరులు ఉన్నారు.


**IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD**
**O.S. No. 1572 of 2026**

***Between:***
1. Samudrala Srinivas
2. Samudrala Arvind Kumar
3. P Sarupa
4.Mudigonda Renuka

**...Plaintiffs**

**AND**

1. The Tahsildar, Bahadurpura Mandal, Hyderabad, T.G.
2. All Concerned.

**....Defendants**

**N O T I C E**

To,
All Concerned
**...Defendant No.2**

Please take Notice that the above named plaintiffs have filed the above suit for Declaration of Legal Heirship of Late S.Buchaiah against you and another and said suit is stands posted to 08-07-2026 at 10:30 AM for appearance.If any person or persons are having any objection or objections they shall be appeared before the above said Hon'ble Court in person or through an Advocate on the above said date and time or else the matter will be decided as per law.

***(BY ORDER OF THE COURT)***
Sd/-
**U. MALLESH,**
**Advocate**
**Office at 15-3-372, Gowliguda Chaman, Hyderabad, T.G**
**Cell:Cell: 8919256672**


## కొడకంచి పాఠశాలలో సామాజిక తనిఖీ

**- హాజరైన సెంట్రల్ సామాజిక తనిఖీ అధికారి విక్రమ్ గౌడ్**

జిన్నారం
జులై 4(వుదయం ప్రతినిధి)

జిన్నారం మున్సిపల్ పరిధిలోని కోడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆడిటర్లు సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సెంట్రల్ సామాజిక తనిఖీ అధికారి విక్రమ్ గౌడ్ సమగ్ర తనిఖీలో భాగంగా కౌన్సిలర్ను ఉపాధ్యాయులను విద్యార్థులను ప్రశ్నించారు. ఆరు ఏడవ తరగతి గదుల కొరత తో పాటు లైబ్రరీ సైన్స్ బాలికలకు మూత్రశాలలు సరైన విధంగా లేవని తనిఖీలో పేర్కొన్నారు. పాఠశాలకు తాగునీటి సమస్య కూడా నెలకొంది ఉందని విన్నవించారు. పాఠశాల గ్రాండ్ లు పుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫామ్ లు తదితర విషయాలతో పాటు మౌలిక సదుపాయాల గురించి అధికారి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సంబంధించి విద్యా వైద్యం పౌష్టికాహారం తదితర విషయాలపై విద్యార్థులతో మాట్లాడి అధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీలత నాయకులు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ గౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బురదమయంగా అన్నారంజంగంపేట్ రోడ్డు

జిన్నారం
జులై 4(వుదయం ప్రతినిధి)



జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని జంగంపేట్ నుంచి అన్నారం ప్రధాన రహదారి వర్షాల కారణంగా బురదమయంగా మారింది. రోడ్డంతా బురద, గుంతలతో నిండిపోవడంతో వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు జారిపడే ప్రమాదం ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిష్టయపల్లి కొర్లకుంట రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టండిగడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్లకుంట - కిష్టయ్యపల్లి రహదారి గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా నీటితో నిండిపోవడంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోజూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ రోడ్ల దుస్థితిపై తగువిధంగా అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

## జిన్నారం ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కోర్టు జడ్జి

జిన్నారం
జులై 4(వుదయం ప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిన్నారం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి తేజశ్రీ అన్నారు. శనివారం జిన్నారం మున్సిపల్ కేంద్ర సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, బోధన పద్ధతులు, మధ్యాహ్న భోజనం అమలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం జరుగుతుందని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై హనుమంతు, బార్ కౌన్సిల్ సభ్యులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉష
వుదయం సాహిత్యం

# టీనేజ్ ఆడపిల్లలు చదవాల్సిన నవల

(ఏంజల్ పుస్తక సమీక్ష)

టీనేజ్ లో భావోద్వేగాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది, కొన్ని సందర్భాల్లో ప్రతీ చిన్న విషయమూ జీవిన మరణ సమస్యలా అనిపిస్తుంది. అందుకే టీనేజర్లను విమర్శించే ముందు వారి లోపలి అలజడిని అర్థం చేసుకోవాలి." అంటారు ప్రసిద్ధ అమెరికన్ మన స్తత్వవేత్త జి. స్టాన్లీ హాల్.

"ఏ ఒక్కరూ నన్ను అర్థం చేసుకోవడం లేదనే భావనే టీనేజ్‌లో వచ్చే అత్యంత ప్రమాదకరమైన ఒంటరితనం." అంటారు ఇంగ్లీష్ రచయిత జె.డి. శాలింజర్. టీనేజ్ మనస్తత్వానికి సంబంధించి అత్యంత ప్రతిష్టాత్మకమైన నవల 'ది క్యాచర్ ఇన్ ది రై' రాసిన రచయిత ఆయన.

టీనేజ్ అనేది చిన్న పిల్లల ప్రపంచం నుండి పెద్దల ప్రపంచంలోకి అడుగుపెట్టే ఒక సందిగ్ధ సమయం. ముఖ్యంగా ఈ వయసువారు తమ సొంత గుర్తింపు కోసం, స్వేచ్ఛ కోసం ప్రయత్నిస్తుంటారు. వారు ఒకే సమయంలో ఎంతో పరిణతి చెందినట్టుగానూ, మరుక్షణమే ఎంతో అమాయకంగానూ కనిపిస్తారు. సొంతంగా నిర్ణయాలు తీసుకోవాలని, ప్రతి విషయానికి పెద్దలపై ఆధారపడకూడదని భావిస్తారు. సమాజంలో, స్నేహితుల్లో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలని ఆరాటపడతారు. హార్మోన్ల మార్పువల్ల ఆ వయసులో భావోద్వేగాలు చాలా తీవ్రంగా ఉంటాయి. చిన్న విషయానికే అమితమైన ఆనందం లేదా తీవ్రమైన కోపం, నిరాశకు లోనవుతుంటారు. స్నేహితుల ఒత్తిడి వల్ల చెడు అలవాట్లకు దగ్గరవుతారు.

శరీరంలో వచ్చే మార్పులు, మొటిమలు, బరువు పెరగడం లేదా తగ్గడం వంటి విషయాల వల్ల, తమ రూపం పట్ల ఆందోళన చెందుతారు. ఇతరులతో పోల్చుకుని ఆత్మన్యూనతా భావానికి (Inferiority Complex) లోనవుతుంటారు. ప్రేమ, ఆకర్షణల మధ్య తేడా తెలియక గందరగోళానికి గురవుతుంటారు. ఇవి కొన్నిసార్లు వారి చదువును, మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తాయి. మరీ ముఖ్యంగా టీనేజ్ ఆడపిల్లలకు తమ తల్లిదండ్రుల మద్దతు అవసరం. టీనేజ్ కారణంగా ఆడపిల్లలకు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోగలిగేలా వారిని సంసిద్ధం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. లేకుంటే ఆడపిల్లలు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురౌతారు. అది వారి వర్తమానం, భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది.

బాలసాహిత్య నవల 'మాయా లోకం' ద్వారా కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం పొందిన రచయిత 'పి చంద్రశేఖర్ ఆజాద్'. టీనేజ్ ఆడపిల్లల ఆలోచనలు, ఆశయాలు, ఆవేదనలు, సమస్యలు, భయాలు మొదలైన వాటిని రచయిత ఈ ఏంజల్ పుస్తకంలో చర్చించారు.

★★★★★

ఇది మహిత అనే అమ్మాయి కథ. ఆ అమ్మాయి 13 ఏళ్ల వయసు నుండి 19 ఏళ్ల వయసు వరకు నడిచే టీనేజ్ కథ. టీనేజ్ పిల్లల కష్టాలు, ఇష్టాలు, చదువు, కెరియర్, స్నేహం, ప్రేమ మొదలైన వాటిని ఈ నవలలో అనుభూతి చెందుతాము. ఇది కేవలం మహిత కథ మాత్రమే కాదు. ఆ వయసు ఆడపిల్లలందరి కథ.

చిన్నపిల్లలకు సహజంగానే ఊహాశక్తి ఎక్కువ. పెరిగి పెద్దయ్యేకొద్దీ వాళ్ళు వాస్తవికత (Reality) లోకి వస్తారు. కానీ కొందరు పిల్లలు టీనేజ్ లో కూడా ఊహల్లోనే విహరిస్తుంటారు. బహుశా వారే ఆ తరువాత సాహిత్యం పట్ల, సంగీతం పట్ల, వివిధ రకాల కళల పట్ల ఆకర్షణ చెంది, ఆ దారిలో తమ జీవితాన్ని మలుచుకుంటారు. చిన్నప్పుడు తమలో తాము మాట్లాడుకునే వాళ్లే ఆ తర్వాత కాలంలో కళాకారులుగా ఎదుగుతారు. ఈ కథలో మహిత కూడా అచ్చం అలాంటి అమ్మాయే! తను చెప్పాలనుకున్న వాటిని చెప్పుకోవడానికి ఏంజెల్ అనే పాత్రను తనకు తెలియకుండా, తనకు తానే సృష్టించుకుంటుంది. తన కష్ట సుఖాలను ఏంజెల్ తో చెప్పుకుంటుంది. తను తీసుకునే నిర్ణయాలను ఏంజెల్ తో చర్చిస్తుంది. తను తప్పు చేసినప్పుడు ఏంజెల్ చేత తిట్టించుకుంటుంది.




మహిత, ఉద్యోగం మానేసిన ఆమె తల్లి, ఉద్యోగ బాధ్యతల్లో తలమునకలవుతున్న తండ్రి, పెరిగి పెద్దవుతున్న చెల్లి, అల్లరి చేసే తమ్ముడు, తనని ఎంతగానో ప్రేమించే తాతయ్య, నాన్నమ్మ, తనకు దూరమైన తాతమ్మ. ఒక చక్కటి కుటుంబాన్ని మన కళ్ళకు కట్టినట్టు మహి ఈ కథలో మనకు చూపిస్తుంది. చనిపోయిన మహి తమ్ముడిది కూడా నవలలో ముఖ్యమైన పాత్రే!

ఈ కథలో మరో ముఖ్యమైన పాత్ర విద్య, మహిత స్నేహితురాలు. తల్లితండ్రుల కలహాలు, గొడవలతో తండ్రి ప్రేమకు దూరమై, నిరంతర సంఘర్షణను ఎదుర్కొనే పాత్ర విద్యది. పిల్లలకు మంచి పేరెంటింగ్ ఎంత అవసరమో తెలియజెప్పే పాత్ర. తల్లిదండ్రుల మధ్య అన్యోన్యత లేకుంటే పిల్లలు మానసికంగా ఎంత బాధ పడుతారో తెలియచెప్పే పాత్ర. తన తల్లిదండ్రులు ఎప్పటికైనా కలవాలని, వారిద్దరి వద్ద తాను సంతోషంగా పెరగాలని ఆశించే పాత్ర. ఈ నవల 13 ఏళ్ల మహి వయసు దగ్గర్నుంచి మొదలవుతుంది. అక్కడి నుంచి మహి, ఆమె స్నేహితురాలు విద్య పాత్రల్లో మానసిక పరిపక్వత పెరుగుతూ మనకు కనబడుతుంది. నవల మొదలైనప్పుడు అమాయకంగా, అనాలోచితంగా మొదలైన పాత్రలు, నవల పూర్తయ్యేపాటికి తమ కెరియర్ గురించి, ప్రేమ గురించి మాట్లాడుకోగలుగుతాయి. ఇదంతా ఒక్కసారిగా జరిగినట్టు కాకుండా రచయిత ఆ పాత్రల్లో పెరుగుతున్న మానసిక పరిపక్వతను మన కళ్ళ ముందు అంచెలంచలుగా చూపించడంలో సఫలమయ్యారు..

* టీనేజ్ అనేది చిన్న పిల్లల ప్రపంచం నుండి పెద్దల ప్రపంచంలోకి అడుగుపెట్టే ఒక సందిగ్ధ సమయం. ముఖ్యంగా ఈ వయసువారు తమ సొంత గుర్తింపు కోసం, స్వేచ్ఛ కోసం ప్రయత్నిస్తుంటారు. వారు ఒకే సమయంలో ఎంతో పరిణతి చెందినట్టుగానూ, మరుక్షణమే ఎంతో అమాయకంగానూ కనిపిస్తారు. సొంతంగా నిర్ణయాలు తీసుకోవాలని, ప్రతి విషయానికి పెద్దలపై ఆధారపడ కూడదని భావిస్తారు. సమాజంలో, స్నేహితుల్లో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలని ఆరాటపడతారు. హార్మోన్ల మార్పువల్ల ఆ వయసులో భావోద్వేగాలు చాలా తీవ్రంగా ఉంటాయి. చిన్న విషయానికే అమితమైన ఆనందం లేదా తీవ్రమైన కోపం, నిరాశకు లోనవుతుంటారు. స్నేహితుల ఒత్తిడి వల్ల చెడు అలవాట్లకు దగ్గరవుతారు.

★★★★★

నవల ప్రారంభమైన మొదటి 15 పేజీల వరకూ పాఠకుడు కాస్త ఓపిగ్గా చదవాల్సి ఉంటుంది. ఎప్పుడైతే విద్య పాత్ర కథలో ప్రవేశిస్తుందో, అప్పటినుంచి కథ చాలా ఆసక్తిగా తయారవుతుంది. పాఠకుడిని చకచకా చదివించేలా చేస్తుంది. నవల పూర్తయినా, రచయిత మహిత కథకు ఫుల్ స్టాప్ పెట్టలేదు. నవల అసంపూర్ణంగానే ముగిసినట్టు అనిపిస్తుంది. కొనసాగింపుగా ఏంజెల్ -2 రాసి రచయిత పాఠకులను సంతృప్తి పరుస్తారేమో చూడాలి. ఆజాద్ సీనియర్ రచయిత. ట న్నుల పేజీల కొద్దీ సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో వారు తన నైపుణ్యాన్ని చూపారు. వారి అనుభవం ఈ నవలలోనూ స్పష్టంగా కనబడుతుంది. చంద్రశేఖర్ ఆజాద్ ఏంజెల్ నవల ప్రతి టీనేజ్ ఆడపిల్ల, వారి తల్లిదండ్రులు తప్పక చదవాల్సిన నవల. టీనేజ్ పిల్లలపై, వారి అలోచనలపై తెలుగులో మరింత సాహిత్యం రావలసిన అవసరం ఉంది. అందుకు ఈ నవల ఒక ముందడుగు.

(పేట యుగంధర్. – 9492571731)

పుస్తకం వివరాలు:
పుస్తకం పేరు : ఏంజల్ (నవల)
వెల :175/-
రచయిత : పి. చంద్ర శేఖర ఆజాద్
ప్రచురణ : అన్వీక్షకి పబ్లిషర్స్
పుస్తకం కొరకు : 9705972222, అమేజాన్.


పేట యుగంధర్

భారతీయ కవిత


## ఆ మిగతా పిల్లలు

కొందరు పిల్లల నిద్రలు
ఒక అద్భుతమైన గాథాప్రపంచంతో
నిండుతాయి
మిగతా పిల్లలు వాళ్ల నిద్రలో
ఎండిన ఆకులు విరిగిన చప్పుడు వింటారు

కొందరు పిల్లలు తమ వెన్నుల మీద
అందమైన అట్టలున్న పుస్తకాలను మోస్తారు
మిగతా పిల్లలకు వాళ్ల పేర్లు రాసుకోవడం
కూడా రాదు

కొందరు పిల్లలు అలా కళ్లు మూసుకుంటే చాలు
ఆకాశంలోకి ఎగురుతారు
మిగతా పిల్లలు ఏదో ఒక ఉపద్రవానికి
గురవుతుంటారు

కొందరు పిల్లలు పుస్తకాల నుంచి
పుష్ప వర్ణాలను, సీతాకోకల రెక్కలను
లోహపు నాదాలను తెలుసుకుంటారు
మిగతా పిల్లలు చూస్తూ తాకుతూ
కష్టాలు పడుతూ
ప్రపంచాన్ని తెలుసుకుంటారు



కొందరు పిల్లలతో ప్రపంచం
సరిగా కుదురుకోదు
మిగతా పిల్లలంతా ఒక్క దగ్గరై
దాన్ని కుదురుకునేలా చేస్తారు

హిందీ మూలం: కృష్ణ మోహన్ ఝా
ఆంగ్లానువాదం: రాబర్ట్ ఏ హ్యూక్ స్టెడ్
తెలుగు సేత:
దర్భశయనం శ్రీనివాసాచార్య

## తెల్లకోటుపై నల్లని మచ్చ

ధన్వంతరి చేతి అమృతకలశం
దురాశల రాపిడికి చిట్లిపో
యింది...
ఆ అమృతపు చుక్కలే నేడు
కార్పొరేట్ గాజు మేడలపై
ధరల పట్టికలై వేలాడుతు
న్నాయి!

ప్రాణాల రాగాన్ని ఆలకించా
ల్సిన స్టెతస్కోప్
ఇప్పుడు గుండె చప్పుళ్లను
కాదు,
జేబుల లోతులను తూచే
వాణిజ్య త్రాసుగా మారిపో
యింది.

ఒకప్పుడు వైద్యుని హస్తస్పర్శ
ఆపన్నుని నుదుట భరోసా
మొలిపించేది...
నేడు అదే హస్తం
శస్త్రచికిత్సల సమ్మతి పత్రాలపై
సంతకాలకే పరిమితమవు
తోంది!

నాడు బిధాన్ చంద్రరాయ్
వెలిగించిన ఆశల దీపం
రోగి కన్నీటిని తుడిచే వెలుగైతే,
నేడు కొన్నిచోట్ల ఆ వెలుగు
కార్పొరేట్ నియాన్ బోర్డుల
మెరుపుల్లో
మసకబారిపోతోంది.

కరుణకు ప్రతీక కావాల్సిన
తెల్లకోటు,
నేడు కమీషన్ల కప్పుగా,
టార్గెట్ల యూనిఫాంగా,
లాభాల లెక్కల వ్యాపార
ముద్రగా
రూపాంతరం చెందుతోంది!

పరీక్షల పేరుతో
కాసుల చక్రవ్యూహంలోకి నెట్టే
స్తున్నారు;మందుల చీటీల అక్ష
రాలపైవైద్యుడి కలం కంటే,
ఫార్మా సంస్థల నల్లని నీడలే
ఎక్కువగా అలుముకుంటు
న్నాయ

సహజ ప్రసవం ప్రకృతి రాసిన
మాతృగీతమైతే,
సిజేరియన్ కత్తులు
లాభాల లెక్కలు రాస్తున్నాయని
ప్రసూతి గదులు మూగగా రోది
స్తున్నాయి!

శవం చల్లారక ముందే బిల్లు
వేడెక్కే దుస్థితి...
కన్నీళ్లు ఆరకముందే కౌంటర్లు
తెరుచుకునే నిర్దయ...

ప్రాణం ఆగిన చోట
లాభాల లెక్కలు మొదలయ్యే
సంస్కృతి...
ఇది వైద్యశాస్త్రం కాదు –
మానవత్వం మరణిస్తున్న
క్షణం!

అయినా... అంతా చీకటే
కాదు!

కోవిడ్ కాలపు మృత్యుకుహ
రంలో
తమ శ్వాసను దేశానికి
హోమం చేసిన
తెల్లకోటు వీరులున్నారు.
పల్లెటూరి ధూళి దారుల్లో
పేదవాడి నాడి పట్టి ధైర్యమిచ్చే
దేవదూతలున్నారు.
ప్రభుత్వ ఆసుపత్రుల నిశీధి
వేళల్లో
నిద్రను త్యాగం చేసి
ప్రాణాలను నిలబెట్టే కర్మయో
గులున్నారు.

వారే ఈ వృత్తికి జీవనాడి...
వారే తెల్లకోటుకు అసలైన
గౌరవం...
ధన్వంతరి వంశానికి మిగిలిన
దీపస్తంభాలు!

ఓ వైద్యుడా!
నీ చేతివేళ్లలో
ఔషధం కంటే గొప్ప
మానవత్వం ఉంది.
నీ మాటల్లో
మందుల కంటే పదునైన
భరోసా ఉంది.

స్టెతస్కోప్‌ను మళ్లీ
గుండె చప్పుళ్లను వినేందుకే
అంకితం చేయి;
బిల్లుల శబ్దాలకు కాదు.

ఆ తెల్లకోటుపై పడిన
వ్యాపార మరకలను
నీ నిబద్ధతతో కడిగేయి.
మళ్లీ ధన్వంతరి
అమృతకలశాన్ని
అచ్చమైన సేవాతత్వంతో
నింపు.

ఎందుకంటే...
వైద్య వృత్తికి అసలైన గుర్తింపు
స్టెతస్కోప్ కాదు,
రోగి కళ్లలో మెరిసే నమ్మకమే!

- యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

# విశిష్ట నటనకు విజయశాంతి!

*సంఘర్షణ, ఛాలెంజ్, పసివాడి ప్రాణం, స్వయంకృషి, కొండవీటి దొంగ,అత్తకు యముడు అమ్మాయికి మొగుడు, గ్యాంగ్ లీడర్ లో కన్య కుమారి గా చిరంజీవితో, ముద్దుల క్రిష్ణయ్య, ముద్దుల మేనల్లుడు, మువ్వ గోపాలుడు, ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ముద్దుల మావయ్య, లారీ డ్రైవర్ లో జయమ్మ గా , తదితర చిత్రాలతో బాలకృష్ణకు, ఇంకా శోభన్‌బాబు, సుమన్, నాగార్జున, వెంకటేష్, కృష్ణ, రజనీకాంత్ ప్రభృతులతో హిట్ పెయిర్ హీరోయిన్ అనిపించుకుంది.*

గ్లామర్ క్వీన్ పాత్రలతో, డేషింగ్ డేరింగ్ భూమికల్లో రెండున్నర దశాబ్దాలకు పైబడి రాణించి అభిమానుల హృదయాలను కొల్లగొట్టింది విజయశాంతి. పిడిగుద్దులు, చెంప దెబ్బలు విసిరేస్తూ, కంటి చూపుతో కర్కశత్వాన్ని, పౌరుషాన్ని చూపి బెంబేలెత్తిం చడం ద్వారా ప్రేక్షకులను అలరించి యాంగ్రీ యంగ్ వుమెన్, యాక్షన్ క్వీన్ ఇమేజ్, లేడీ అమితాబ్ అని తెలుగు చిత్ర సీమలో అనిపించుకుని పంచ భాషా చిత్రాల్లో అంటే తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ హిందీ భాషల్లో నటించి చక్కని పేరు సాధించు కుంటోంది విజయశాంతి. "యాక్షన్ ఇమేజ్‌ని చూపే పాత్రలలో కొనసాగుతూనే నా ప్రతిభకు పరీక్షపెట్టేటువంటి విభిన్నమైన పాత్రలు లభిస్తే వాటిలోనూ అప్పుడప్పుడు నటిస్తాను" అని చెబుతుండే దామె. "ఒసేయ్ రాములమ్మ" చిత్రం ద్వారా దాసరి తనలోని కొత్తకోణాలను చూపించారని ఆ తర్వాతనే 'రాములక్క','రాములమ్మ 'అని అంటున్నారని మురిసిపోయేది. ఇందిరమ్మ లో ఇందిర గా 2004లో నాయడమ్మ లో 2006లో నాయడమ్మ, ఝాన్సీ గా నటించి మంచి పేరు వచ్చినా నటనకు విరామం ప్రకటించింది. 'కొత్త ఇన్నింగ్' ద్వారా పద్నాలుగేళ్ల విరామం తర్వాత 'సరిలేరు నాకెవ్వరు ' తో 2020లో భారతిగా రి ఎంట్రీ ఇచ్చి తనకు సరిలేరు సాటి లేరెవ్వరు అనిపించింది.ఇంకా ఎలాటి పాత్రలతో మెప్పిస్తుందో! చిత్ర ప్రవేశం ఎలాగంటే 1978 చివర్లో హైదరాబాద్ రామకృష్ణ స్టూడియోలో ఎన్ టి ఆర్ తో మాట్లాడి అక్కడ బాలకృష్ణ షూటింగ్ కవర్ చేద్దామని నేను వెడుతూంటే తండ్రి సత్తి శ్రీనివాస ప్రసాద్ శాంతిని చూపించాడు. ఒక ఏడాది ఆగితే మంచి ఛాన్సులొస్తాయని ఈ లోగా తొందర పడితే ఏవేవో వస్తాయని అన్నా. అలా అన్నాక ఎన్ టి ఆర్ ని కలిసి మద్రాస్ వెళ్లిపోయారు. ఆ తర్వాత వేషాల కోసం ప్రయత్నం చేస్తూ, భారతీరాజా దృష్టిని ఆకట్టుకుంది విజయశాంతి. పి.ఎస్.నివాస్ దర్శకత్వంలో రూపొందిన 'కలుక్కుల్ ఈరమ్' చిత్రానికి స్క్రీన్ ప్లేతో పాటు నటుడుగా కూడా వ్యవహరిస్తున్న భారతీ రాజా చిత్రంలో తన సరసన ముచ్చెర్ల అరుణకు, సుధాకర్ సరసన విజయశాంతికి నాయికగా అవకాశాలు వచ్చేలా చేశారు. సరదాగా నవ్వించే పల్లెటూరి అమాయిక యువతి పాత్ర. పేరుకు ముందు 'విజయ' ను చిత్రరంగంలో జేరే సమయంలో చేర్చుకున్న విజయశాంతి ఈ చిత్రంలో నటిస్తుం డగానే విజయనిర్మల దర్శకత్వంలో కృష్ణ హీరోగా రూపొందిన 'కిలాడి కృష్ణుడు' చిత్రంలో నాయికగ ఎంపిక యింది. తమిళ చిత్రం 29.2.1980 విడుదలై తమిళులకు, కిలాడి కృష్ణుడు 12.9.80న విడుదలై తెలుగువారికి పరిచయమైంది విజయశాంతి. వరుసగా తెలుగు, తమిళ చిత్రాల్లో అవకాశాలు పెరిగి స్వల్ప కాలంలోనే గ్లామర్ హీరోయిన్ అనిపించుకుంటూ చక్కని నటనను,



నాట్యాలను ప్రదర్శిస్తూ సినిమా విజయంలో హీరోతో పాటు హీరోయిన్‌కీ అధిక స్థానం వుందనేట్టు చేసింది. టి.కృష్ణ దృష్టిలో పడటంతో ఆయన దర్శకత్వంలో రూపొందిన 'నేటి భారతం, వందేమాతరం, దేశంలో దొంగలు పడ్డారు, దేవాలయం, ప్రతిఘటన, రేపటి పౌరులు' చిత్రాలన్నీ ఆమెలోని వివిధ పార్శ్వాలను బయటిపెట్టి ప్రతిభావంతురాలుగా నిరూపించాయి.

సంఘర్షణ, ఛాలెంజ్, పసివాడి ప్రాణం, స్వయంకృషి, కొండవీటి దొంగ,అత్తకు యముడు అమ్మాయికి మొగుడు, గ్యాంగ్ లీడర్ లో కన్య కుమారి గా చిరంజీవితో, ముద్దుల క్రిష్ణయ్య, ముద్దుల మేనల్లుడు, మువ్వ గోపాలుడు, ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ముద్దుల మావయ్య, లారీ డ్రైవర్ లో జయమ్మ గా , తదితర చిత్రాలతో బాలకృష్ణకు, ఇంకా శోభన్‌బాబు, సుమన్, నాగార్జున, వెంకటేష్, కృష్ణ, రజనీకాంత్ ప్రభృతులతో హిట్ పెయిర్ హీరోయిన్ అనిపించుకుంది.

మోహన్ గాంధి దర్శకత్వంలో రూపొందిన 'కర్తవ్యం'లో పోలీసు ఆఫీసర్‌గా కిరణ్‌బేడీని స్ఫూర్తిగా తీసుకుని వైజయంతి ఐ పి ఎస్ గా నటించిన దగ్గర నుంచి 'లేడి సూపర్ స్టార్, యాక్షన్ క్వీన్'గా రాణించింది విజయశాంతి. రజనీకాంత్ సరసన నటించిన 'మన్నన్' చిత్ర ఘన విజయంతో రజనీకాంత్‌తో పాటు విజయశాంతి ఖాతాలోనూ ఆ గొప్పదనం వచ్చి చేరింది. ఇంద్రుడు చంద్రుడు, శత్రువు, పడమటి సంధ్యారాగం, రౌడీ ఇన్స్పెక్టర్, మొండి మొగుడు పెంకి పెళ్ళాం, కొడుకు దిద్దిన కాపురం ఇలా ఎన్నో చిత్రాల్లో చక్కని పాత్రలు పోషించి ప్రశంసలు పొందింది.

### టైమ్ పాస్ ట్రిక్స్ !

'ఇన్‌స్పెక్టర్ ప్రతాప్' షూటింగ్ శ్రీశైలంలో జరుగుతుండగా ఆ చిత్ర సారథి వై. హరి కృష్ణను 'డాడీ' అని పిలిచే అలవాటుతో డాడీ అని పిలిచింది.'ఎందుకమ్మాయి' అని ఆయన దగ్గరకు రాగానే ఆయన ముంజేతిలో కనిపించే ఓ నరాన్ని పట్టుకుని లాగి, 'టప్' అనే శబ్దం వచ్చేలా చేసింది. ఆయనకి, ఏవిధమైన నొప్పి కలగలేదు కానీ ఆ శబ్దంకి అందరూ చుట్టూ మూగారు. మరోసారి హరికృష్ణ మీద అలా అని, తర్వాత శరత్ బాబు చేయి పట్టుకుని అలా చేసింది. "నరాన్ని పట్టుకున్నట్టు రెండు వేళ్లతో పట్టుకుని గోళ్లతో సౌండ్ చేయిస్తున్నావు కదూ!" అని శరత్‌బాబు అడిగితే కాదంది. యూనిట్ సభ్యులు ఆమెకే వత్తాసు పలికారు. "నా చేతికి అలా చెయ్యి. నీ గుట్టు విప్పుతా. రట్టు చేస్తా" అని బాలకృష్ణ చేయందించారు . రెండు సార్లు ఆ ట్రిక్ ప్లే చేసింది. బాలకృష్ణతో బాటు మిగతా వాళ్లు అలా ఆ ప్రయత్నం చేయసాగారు. ఎంత డిగినా రహస్యం చెప్పలేదు విజయశాంతి. మరో షాట్ బ్రేక్‌లో కుర్చీలో కూర్చొని చేతులు రెండు ముఖానికి కొంచెం దూరంలో పెట్టుకుని విచిత్రంగా వేళ్లను కదుపుతూ, తిప్పుతూ మళ్లీ కలపడం చేయసాగింది. ఇంతగా, ఆమె చేసే పనిని చూసి సహచర నటీనటులు తదితరులు కూడా అలానే ప్రాక్టీసు చేయసాగారు. "షాట్ రెడీ" అని పిలుపు రాగానే ఆమె వెళ్లి పోయింది. మిగతా వాళ్లు తమ ప్రాక్టీసు మాననే లేదు. విజయశాంతితో మీరు "ఎలా చేస్తారో చెప్పండి" అని అడిగితే కాలక్షేపం కోసం చేసే ట్రిక్స్ రహస్యాలు చెప్పేస్తే ఎలా?" అని నవ్వుతూ వెళ్లిపోయింది.

### శోభన్ జోస్యం నిజం చేసిన శాంతి !

1986 జనవరిలో శోభన్‌బాబు మాట్లాడుతూ నటనలో పట్టు సాధిస్తోంది. మంచి పాత్రలు లభిస్తున్నాయి. మేము ఇద్దరూ కలిసి చేసిన వాటిలో కూడా మంచి పాత్రలే. దేవాలయంలో అంత చక్కగా నటించిందంటే గొప్పే కదా! ఇంకా పదేళ్లపైన హీరోయిన్‌గా కొనసాగుతుంది. ఇదే ప్రవర్తన ఇక ముందు కూడా ఉంటే సావిత్రిలా మహానటి అవుతుంది" అన్నారు. శోభన్ బాబు మాటలు అలా నిజం అయ్యాయి, కానీ పదేళ్లు కాదు ఇరవై ఏళ్ల పాటు! ఆ తరువాత రి ఎంట్రీతో మళ్ళీ జోష్ పెంచుతోంది. అర్జున్ s% వైజయంతి లో వైజయంతిగా యాక్షన్ సన్నివేశాల్లో ఇతర దృశ్యాల్లో ప్రేక్షకుల దృష్టి విజయశాంతి మీదనే ఉందంటే చెప్పుకోదగ్గ విషయమే కదా! కర్తవ్యం చిత్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు లభించింది. ప్రతిఘటన, భారత నారి, కర్తవ్యం, ఒసేయ్ రాములమ్మ చిత్రాలకు ఉత్తమ నటిగా నంది అవార్డులు, తమిళనాడు ప్రభుత్వం నుంచి కలైమామణి అవార్డు, ఫిలిమ్ ఫేర్ అవార్డులు ఇలా చాలా లభించడానికి కారణం నటనలో విజయశాంతి చూపే ప్రత్యేక శ్రద్ధయే!

– వి.ఎస్.ఆర్.కేశవరావు
9989235320

## లాల్చావులు

* దుబ్బ కాళ్లు దూళి కాళ్లు, మన్నంటిన చరణాలు
* గజ్జలు కట్టుకొని కైగట్టి ఎగురుతున్న పాదాలు
* అగ్గి గుండం సుట్టు ఘల్లు ఘల్లున అడుగులు
* పొద్దుందాక పొలం దున్నిన పోశాలు మామ
* ట్రాక్టర్ మీద వడ్లు జార కొట్టే వీర భద్రయ్య
* మ్యాకలు మేప పోయిన మంద మల్లయ్య
* యాట కూర కోసే ముక్తార్ చిచ్చ
* కాయ కష్టాల మనుషులంత వడివడిగ
* చావిడికి కుచేరుకున్న సాయం సమయం



* పీర్ల గుండంల కెల్లి నెగడు దగడు
* అలావా సుట్టూర ధన ధన మువ్వల ధ్వని
* ఎన్నీల రాత్రంతా ఆటపాటల సందడి
* అసోయ్ దూలా...అసోయ్ దూలా..
* మానెడు జొన్నలు మలీద ముద్దలు..
* ఆశన్న....ఊశన్నలాలా ..అసోయ్ దూలా..
* చందమామ వెలుగుల్లో ఆశన్న ఊశన్నలాల
* అసోయ్ దూలా...అసోయ్ దూలా..అసోయ్
* ఆ సామూహిక గానం బహుజనావళి గీతం
* పీర్ల పండుగ అంటేనే పురి విప్పిన సంబురం
* ఊద్దాన్ నుంచి వ్యాపించిన గుగ్గిలం
* పరిమళం పెద్దపీరి చిన్నపీరి,
* తల్లి పీర్లల్లో లేచిన తరంగాలు
* ఆవహించి ఆవహించి లయాత్మక పారవశ్యం
* నడుములకు తువ్వాలలు, నొసటన దస్తి కట్టి
* ఎత్తుకున్న లాల్చావులు,ఎగురుతున్న తాండవం
* వాడవాడలూ దప్పు సప్పుల్ల ఊరేగింపులు
* ఇంటింటికీ తీర్చుకున్న కుడుకల పీర్ల మొక్కులు
* హుసేన్ హుస్సేన్ లు ఆశన్న ఊషన్నలే
* కలె గలిసిపోయిన సంస్కృతిక సహోదరత
* నొసట మీద ఊదు బొట్టు పెట్టిన మైబెల్లి తాత
* మాట్కిల్ల షర్బత్ తాగడం మొహర్రం పర్వం

*

అన్నవరం దేవేందర్
9440763479

## 'అరుణోదయ నాగన్న'కు నివాళి

యుద్ధరంగంలో తుపాకీ గొట్టం ఎంత శక్తివంతమైనదో, ప్రజా క్షేత్రంలో డప్పు చర్మంపై పడే దెబ్బ అంతకంటే పదునైనదని నిరూపించిన మహోన్నత ప్రజా గాయకుడు అరుణోదయ నాగన్న. పల్లె పల్లెనా విప్లవ చైతన్యపు విత్తనాలు నాటి, పాలకుల గుండెల్లో తన పాటల తూటాలతో వణుకు పుట్టించిన ఆ గొంతుక అనంత వాయువుల్లో కలిసిపోయింది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అగ్రనేతగా, దశాబ్దాల పాటు పీడిత ప్రజల పక్షాన నిలబడిన ఒక సజీవ శంఖం మూగబోయింది. నాగన్న భౌతికంగా మనల్ని విడిచివెళ్లినా, ఆయన వదిలి వెళ్లిన పోరాట స్ఫూర్తి, పాటల వారసత్వం ఎప్పటికీ అమరమైనవి. నాగన్న కేవలం ఒక గాయకుడు కాదు; ఆయన ఒక సామాజిక ఉద్యమం. సమాజంలో వేరూనుకున్న కుల వివక్ష, భూస్వామ్య దోపిడీ, సామ్రాజ్యవాద అణచివేతలపై ఆయన గొంతు నిరంతరం శ్రమించింది. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల నుంచి మలిదశ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ప్రతి ప్రజా పోరాటంలోనూ నాగన్న పాట ముందంజలో నిలిచింది.



ఆయన గొంతులో ఒక రకమైన గాంభీర్యం, మట్టి మనుషుల ఆవేదన ఉట్టిపడేవి. అరుణోదయ వేదికలపై ఆయన డప్పు పట్టి అడుగులు వేస్తుంటే, చూసే ప్రతి శ్రామికుడి నరనరాల్లోనూ విప్లవ రక్తం ఉరకలేసేది. దోపిడీ వ్యవస్థ పునాదులను కదిలించేలా, గిరిజన, దళిత, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన ఎన్నో విప్లవాత్మక గీతాలకు ప్రాణం పోశారు.

సాధారణంగా పోరాటాలు అంటే కేవలం ఆయుధాలు, నినాదాలు, సమ్మెలు మాత్రమే అనుకుంటారు. కానీ నాగన్న కళను విప్లవానికి ఒక అత్యుత్తమ సాధనంగా మలిచారు. ప్రజా చైతన్యానికి మించిన ఆయుధం లేదని, ఆ చైతన్యాన్ని రగిలించడానికి పాటను మించిన మాధ్యమం మరొకటి లేదని ఆయన నిరూపించారు. సామాజిక మార్పు కోసం సాంస్కృతిక రంగాన్ని ఒక సాయుధ బలగంగా మార్చిన సేనాధిపతి ఆయన. పదవులకు, ప్రలోభాలకు లొంగకుండా, చివరి శ్వాస వరకు ప్రజా కోర్టులోనే జనం పక్షాన నిలబడి వ్యవస్థలోని కుళ్లును కడిగిపారేసిన నిస్వార్థ యోధుడు. తెలంగాణ సమాజం, ముఖ్యంగా విప్లవ సాంస్కృతిక ప్రపంచం ఒక గొప్ప ప్రజా కళాకారుడిని కోల్పోయి నేడు దిక్కుతోచని స్థితిలో ఉంది. ఒక శబ్దం ముగిసినట్టుగా అనిపించినా, నాగన్న రగిల్చిన చైతన్య దీపులు ఎప్పటికీ ఆరిపోవు. ఆయన పాడిన పాటలు, వేసిన అడుగులు భావితరాల పోరాటాలకు ఎల్లప్పుడూ దిక్సూచిగా, ఇంధనంగా నిలుస్తూనే ఉంటాయి.



రాజేందర్ దామెర
సీనియర్ జర్నలిస్ట్

వుదయం

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# జాతీయం-అంతర్జాతీయం

## వణుకుతున్న ఉత్తరాది..



- భారీ వర్షా లతో పలు రాష్ట్రాలు అతలాకుతలం
- పలు ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ జారీ

**ఢిల్లీ, జులై 04 (ఎ.ఎం.ఎస్):** ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీ, మహారాష్ట్రలోని ముంబాయి, గుజరాత్, ఒడిసా, హిమచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో వానలు కురుస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలో వర్షపు నీటికి వరదలు పోటెత్తుతున్నాయి. పలు చోట్ల రోడ్లలపై భారీగా నీరు నిలిచింది. ముంబాయిలో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో ఎక్కడ చూసిన రోడ్లలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

అదే విధంగా శుక్రవారం ప్రారంభమైన అమర్ నాథ్ యాత్రకు వర్షం ఆటంకం కలిగిస్తోంది. యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని అధికారులు తెలియజేశారు. అమర్‌నాథ్ యాత్రికులు, పర్యాటకుల కోసం జమ్మూ మున్సిపల్ కార్పొరేషన్, జమ్మూ తవి రివర్‌ఫ్రంట్ వద్ద బోటింగ్ సేవలను ప్రారంభించింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రెండవ బృందం, దక్షిణ కాశ్మీర్ హిమాలయాల్లోని పవిత్ర గుహాలయం వైపు తమ కాలి నడక యాత్రను పహల్గామ్‌లోని నున్వాన్ బేస్ క్యాంప్ నుండి అధికారికంగా ప్రారంభించింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా శనివారం ఉదయం కౌఘా సమీపంలోని రామ్‌నగర్‌ఉధంపూర్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఘటన జరిగిన వెంటనే స్థానిక అధికారులు అక్కడికి చేరుకున్నారు.రహదారిపై పడిన పెద్ద బండరాళ్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించేందుకు యంత్రాన్ని రంగంలోకి దించారు. అలాగే ఒడిసాలోని పలు ప్రాంతాలకు కేంద్ర వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. పూరీ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా సంధియాల గ్రామం సమీపంలో వరద నీటిలో చిక్కుకుపోయిన పలువురిని అగ్నిమాపక శాఖ సిబ్బంది శనివారం రక్షించారు. ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు.

### 20 నుంచి పార్లమెంటు

## వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ, జులై 04 (ఎ.ఎం.ఎస్):** జులై 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

ఆగస్టు 13 వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయని చెప్పారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.





## జోథ్‌పూర్‌లో నూతన టెర్మినల్

- ప్రారంభించిన ప్రధాని మోడీ
- దేశ విమానయానంలో కీలక అడుగు

**జోథ్‌పూర్, జులై 4, (ఎ.ఎం.ఎస్):** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం రాజస్థాన్ పర్యటనలో భాగంగా జోథ్‌పూర్ విమానాశ్రయ కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. రూ. 480 కోట్లతో సుమారు 23,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్, ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తుంది. ఈ టెర్మినల్ ఆధునిక ప్రయాణీకులను దృష్టిలో పెట్టుకుని.. ఎలాంటి అవాంతరాలు లేకుండా... వారికి సౌకర్యవంతంగా ఉండేలా దీన్ని నిర్మించడం జరిగిందని ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ పౌర విమానయాన రంగంలో ఒక కీలకమైన ముందడుగు. ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగ్రిక్) లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళుతుంది. ఈ పథకంలోని కొత్త నిబంధనలతో రాబోయే పదేళ్లలో రూ. 28,840 కోట్ల కేటాయింపుతో విమానయాన రంగం ఆధారిత అభివృద్ధి తదుపరి దశను వేగవంతం చేయడానికి ఈ ఉడాన్ పథకం లక్ష్యం అని ప్రధాని కార్యాలయ ప్రకటన పేర్కొంది. కాగా, నేడు రాజస్థాన్‌లో మోడీ సుమారు 12.15 నిమిషాలకు బలోత్రాలో రూ. 1.06 లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతో పాటు, వాటిని ప్రారంభించి, శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా బలోత్రాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోడీ ప్రసంగించనున్నారు.

*ప్రధాని నరేంద్ర మోడీ శనివారం రాజస్థాన్ పర్యటనలో భాగంగా జోథ్‌పూర్ విమానాశ్రయ కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. రూ. 480 కోట్లతో సుమారు 23,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్, ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తుంది. ఈ టెర్మినల్ ఆధునిక ప్రయాణీకులను దృష్టిలో పెట్టుకుని.. ఎలాంటి అవాంతరాలు లేకుండా... వారికి సౌకర్యవంతంగా ఉండేలా దీన్ని నిర్మించడం జరిగిందని ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.*

### ఖమేనీ అంత్యక్రియలకు

## పోటెత్తిన జనం

- కిలోమీటర్ల మేర క్యూలైన్

**టెహ్రాన్, జులై 4(ఎ.ఎం.ఎస్):** ఇరాన్ దివంగత సుప్రీం నేత ఆయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆయన భౌతికకాయాన్ని రాజధాని టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా మసీదులో ఉంచారు. ఈక్రమంలో ఆ దేశ నలుమూలాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఖమేని పార్థివ దేహాన్ని కడసారి చూడడానికి కిలో మీటర్ల మేర క్యూలైన్ వేచి ఉన్నారు. అదే విధంగా దేశ విదేశీ ప్రతినిధులు, అధికారులు ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.జూలై 9న ఖమేనీ అంత్యక్రియలు జరగనున్నాయి. మరో వైపు భద్రతా కారణాల దృష్ట్యా, ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజాతబా ఖమేనీ తన తండ్రి అంత్యక్రియలకు హాజరుకావడం లేదు.



## బీఎల్ఏ వ్యూహాత్మక దాడి..



- 30 మందికిపైగా పాక్ సిబ్బంది మరణం
- అంతర్జాతీయంగా కలకలం

**ఇస్లామాబాద్, జులై 4 (ఎ.ఎం.ఎస్):** పాకిస్థాన్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వేర్పాటువాద సంస్థ బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) మరోసారి భారీ వ్యూహాత్మక దాడికి తెగబడింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని గ్వాదర్ జిల్లా జివానీ పరిధిలోని పాన్వాన్ ప్రాంతంలో గల పాకిస్థాన్ కోస్ట్ గార్డ్స్ ప్రధాన శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుని బీఎల్ఏ గురువారం సాయంత్రం అత్యంత ఘోరమైన ఆత్మాహుతి దాడి జరిపింది. ఈ భీకర దాడిలో దాదాపు 30 మందికి పైగా పాకిస్థానీ కోస్ట్ గార్డ్స్ సిబ్బంది అక్కడికక్కడే మరణించారని.. డజన్ల కొద్దీ గాయపడ్డారని బీఎల్ఏ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) పరిధిలో కీలకమైన గ్వాదర్ ప్రాంతంలో ఈ స్థాయి దాడి జరగడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది.

బీఎల్ఏ మీడియా ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 3వ తేదీ సాయంత్రం సుమారు 6.32 గంటల సమయంలో ఈ ఆపరేషన్ జరిగింది. బీఎల్ఏకు చెందిన అత్యంత ప్రమాదకరమైన మజీద్ బ్రిగేడ్ సభ్యుడు అల్లావుల్లా బలోచ్ అలియాస్ అజ్మల్.. భారీగా పేలుడు పదార్థాలు నింపిన ఒక మాజ్డా వాహనాన్ని వేగంగా కోస్ట్ గార్డ్స్ క్యాంప్‌లోకి తీసుకెళ్లి పేల్చివేశాడు. ఈ పేలుడు ధాటికి సైనిక స్థావరం పూర్తిగా శిథిలమైపోయింది. అంతటితో ఆగకుండా పేలుడు జరిగిన వెంటనే బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్ తుపాకులతో క్యాంప్‌లోకి చొరబడింది. లోపల ప్రాణాలతో మిగిలి ఉన్న పాకిస్థానీ భద్రతా సిబ్బందిపై అత్యంత సమీపం నుంచి ఎదురుకాల్పులు జరిపి అనేక మందిని చంపేసింది. శిథిలాల కింద మరికొందరు సైనికులు చిక్కుకుపోయినందున.. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని బీఎల్ఏ ప్రకటించింది.

అయితే ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం గానీ, అక్కడి సైనిక వర్గాలు (ఐఎస్‌పీఆర్) గానీ ఈ భారీ నష్టంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. బలూచిస్థాన్ వివాదాస్పద ప్రాంతాల్లో అంతర్జాతీయ మీడియాపై పాక్ సైన్యం కఠిన ఆంక్షలు విధించడంతో ఈ మరణాల సంఖ్యను స్వతంత్రంగా ధృవీకరించడం కష్టంగా మారింది. అయినప్పటికీ ఈ ఘోర దాడి అనంతరం గ్వాదర్ తీర ప్రాంతమంతా సైనికుల మోహరింపుతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బలూచ్ పౌర సంఘాలు పాక్ సైన్యంపై మానవ హక్కుల ఉల్లంఘనల ఆరోపణలు చేస్తున్న తరుణంలోనే ఈ ప్రతీకార దాడి జరగడం గమనార్హం.

## అయోధ్యలోనే కాదు.. బద్రీనాథ్‌లోనూ చోరీ...

- విరాళాలు, కానుకల దొంగతనం
- బీకేటీసీ చైర్మెన్ వ్యక్తిగత కార్యదర్శే నిందితుడు

**డెహ్రాడూన్, జులై 4, (ఎ.ఎం.ఎస్):** అయోధ్యలోని రామమందిరంలో విరాళాల చోరీ అంశం కోట్లాది మంది హిందువులను కలచివేస్తోంది. ఇలాంటి తరుణంలో మరో ఆలయంలోనూ భక్తులు సమర్పించిన కానుకలు దోచేశారనే ఆరోపణలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. బద్రీనాథ్ ఆలయంలో విరాళాలు, కానుకల దొంగతనం జరిగిందని ఒక సామాజిక సంస్థ ఆరోపించడంతో బద్రీ కేదార్ ఆలయ కమిటీ ( బీకేటీసీ ) ఈ విషయంపై విచారణకు ఆదేశించింది. రామ మందిరంలో విరాళాల దొంగతనంపై వివాదం చెలరేగిన కొద్ది రోజులకే.. గర్వాల్ పరిధిలోని బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా మరో 47 ఆలయాలలో కానుకల నిర్వహణలో కఠినమైన పర్యవేక్షణ, పారదర్శకత ఉండేలా చూడాలని బీకేటీసీ అధికారులను ఆదేశించిన మర్నాడే ఆరోపణలు వెలుగులోకి రావడం గమనార్హం.



'భైరవ్ సేన సంఘటన్ అనే ఓ స్వచ్ఛంద సంస్థ బీకేటీసీ సీఈఓ సోహన్ సింగ్ రంగర్‌కు శుక్రవారం లేఖ రాసింది. బద్రీనాథ్ ఆలయంలో విరాళాలు, కానుకల దొంగతనంలో బీకేటీసీ ఉద్యోగి ఒకరు పాలుపంచుకున్నారని ఆరోపించింది. సదరు ఉద్యోగిని బీకేటీసీ చైర్మన్ హేమంత్ ద్వివేదికి వ్యక్తిగత కార్యదర్శిగా ఆ సంస్థ పేర్కొంది. ఈ అవకతవకలను గతంలోనే చైర్మన్ దృష్టికి తీసుకువచ్చామని, ఆరోపణలను ధ్రువీకరించడానికి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించాలని ఆలయ కమిటీని ఆ సంస్థ వ్యవస్థాపక సభ్యుడు సందీప్ ఖత్రి కమిటీని కోరారు. ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశించిన హేమంత్ ద్వివేది.. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోన్న ఉద్యోగి తన వ్యక్తిగత కార్యదర్శి కాదని ఆయన స్పష్టం చేశారు. "సంబంధిత ఉద్యోగి బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీలో రెగ్యులర్ ఉద్యోగి.. గతంలో ముగ్గురు చైర్‌పర్సన్‌లకు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు.. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణలు నిజమని తేలితే, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని ద్వివేది అన్నారు.

ఫిర్యాదు నేపథ్యంలో బద్రీనాథ్ ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించినట్లు సీఈఓ రంగర్ తెలిపారు. "ఫుటేజీలో ఆశించినంత స్పష్టత లేదు. అయినప్పటికీ, ఈ విషయం తీవ్రత, సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, చైర్మన్‌కు సమాచారం అందించాం.. సంబంధిత ఉద్యోగుల నుంచి వివరణ కోరుతాం" అని ఆయన అన్నారు. అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాల ఆధారంగా సమగ్ర విచారణ జరిపేందుకు ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. "విచారణలో ఏదైనా అవకతవకలు జరిగినట్టు వెల్లడయితే శ్రీ బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ చట్టం 1939.. వర్తించే సేవా నిబంధనల ప్రకారం చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం" అని రంగర్ అన్నారు.

ప్రస్తుత చార్ ధామ్ యాత్ర సీజన్‌లో బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలకు విరాళాల రూపంలో సుమారు రూ. 70 కోట్లు అందినట్లు తెలిపారు. అతిథి గృహాల ద్వారా కూడా బీకేటీసీ ఆదాయం పొందుతుందని ఆయన చెప్పారు. "వార్షిక విరాళాలు సగటున రూ. 50 కోట్ల నుంచి రూ. 80 కోట్ల మధ్య ఉంటాయి. ఈ మొత్తం యాత్రికుల సంఖ్య, వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలపై ఆధారపడి ఉంటుంది" అని ఆయన అన్నారు. బ్యాంకు సిబ్బంది సమక్షంలో నలుగురు లేదా ఐదుగురు బీకేటీసీ ఉద్యోగుల బృందం విరాళాలను లెక్కిస్తుందని రంగర్ తెలిపారు. "లెక్కింపు ప్రక్రియలో స్వచ్ఛందంగా పాల్గొనాలనుకునే భక్తులను కూడా వారి గుర్తింపు పత్రాలను ధ్రువీకరించుకున్న తర్వాత పాల్గొనడానికి అనుమతిస్తారు. లెక్కింపు పూర్తయిన తర్వాత, విరాళాలను బ్యాంకు ఉద్యోగులకు అప్పగిస్తారు.. వారు వాటిని మళ్లీ లెక్కిస్తారు" అని ఆయన అన్నారు.

## ఉర్దూ జాతీయ భాషే..



- కేంద్ర మాజీ మంత్రి మురళీ మనోహర్ జోషి

**న్యూఢిల్లీ, జులై 4 (ఎ.ఎం.ఎస్):** రాజకీయ, విద్యా రంగాలలో భాషలపై పెరుగుతున్న చర్చల నడుమ బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి మురళీ మనోహర్ జోషి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఉర్దూ ఒక భారతీయ భాష అని , అది దేశం వెలుపల పుట్టలేదని స్పష్టం చేశారు.

భారతీయ ముస్లింలను ఖురాన్‌ను అరబిక్‌కు బదులుగా ఉర్దూలో చదివేలా ప్రోత్సహించ డానికి, అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో చేసిన ప్రయత్నాలను జోషి ప్రశంసించారు.

## టెలిగ్రామ్‌కు మరోసారి కేంద్రం నోటీసులు




**న్యూఢిల్లీ, జులై 4(ఎ.ఎం.ఎస్):** నీట్ పేపర్ లీకేజ్ ఘటనలతో కేంద్ర ప్రభుత్వం సోషల్ మీడియా యాప్ లపై నజర్ పెంచింది. ఇటీవల వాట్సాప్ యూజర్ నెమ్ ఫీచర్ పై మెటా సంస్థకు కేంద్రం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నూతన ఫ్యూచర్ ఆప్షన్ పై పలు అనుమానాలు ఉన్నాయని, వినియోగాదారుల భద్రతకు మెటా చేపట్టిన చర్యలు తెలియజేయాలని పేర్కొంది. తాజాగా ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్' సంస్థకు నోటీసులు జారీ చేసింది. టెలిగ్రామ్' ద్వారా పెద్ద ఎత్తున సినిమాలు, ఓటీటీ కంటెంట్ పైరసీ అవుతుండటంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అక్రమ పైరసీని అరికట్టేందుకు తక్షణ

- కంటెంట్ పైరసీయే కారణం
- 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు

చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ టెలిగ్రామ్ సంస్థకు నోటీసులు జారీ చేసింది.కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు, కాపీరైట్ ఉన్న ఇతర ప్రీమియం కంటెంట్ అనధికారికంగా లింకులు, ఫైళ్ల రూపంలో విస్తృతంగా షేర్ అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రభుత్వం.. పైరసీని అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ 15 రోజుల్లోగా '
యాక్షన్ టేకెన్ రిపోర్ట్' సమర్పించాలని టెలిగ్రామ్‌ను ఆదేశించింది.

## హై హీట్..

**న్యూయార్క్, జులై 4:** అమెరికా తన 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాషింగ్టన్‌లో నిర్వహించాల్సిన సాంప్రదాయ స్వాతంత్ర్య దిన పరేడ్‌ను తీవ్ర వేడి కారణంగా రద్దు చేశారు. శనివారం ఉదయం జరగాల్సిన ఈ పరేడ్ అత్యధిక ఉష్ణోగ్రత వల్ల రద్దు అయిందని నిర్వాహకులు ప్రకటించారు. జాతీయ వాతావరణ సంస్థ ప్రకారం, సుమారు 16 కోట్ల అమెరికన్లు తీవ్ర వేడి హెచ్చరికలు (ఎక్స్‌ట్రీమ్ హీట్ వార్నింగ్స్) ఎదుర్కొంటున్నారు.




తూర్పు అమెరికాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

వాషింగ్టన్‌లోని నేషనల్ మాల్‌లో జరిగే ఉత్సవాలు కూడా వేడి తీవ్రత కారణంగా మధ్యాహ్న భాగం రద్దు చేయాల్సి వచ్చింది. మరోవైపు, వేడిమికి

- అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రద్దు
- ప్రకటించిన నిర్వాహకులు

తట్టుకోలేక అస్వస్థతకు గురైన ఒక యువతిని ఆసుపత్రికి తరలించారు. గ్రేట్ అమెరికన్ స్టేట్ ఫేర్ కార్యక్రమాన్ని కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. న్యూయార్క్‌లో హీట్ ఇండెక్స్ 105 ఫారెన్‌హీట్ (41 డిగ్రీల సెల్సియస్)కి చేరుకుంది. విద్యుత్ గ్రిడ్లపై భారీ ఒత్తిడి పడుతోంది. వేలాది మందికి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ తీవ్ర వేడి అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాలు, ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌లు, విద్యుత్ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

## మృత్యుంజయుడు..

- ఎనిమిది రోజుల తర్వాత ప్రాణాలతో భూకంపం నుంచి సురక్షితంగా బయటకు...
- హెర్నాన్ ఆల్బెర్టో గిల్ ఫ్లోర్స్ విజయగాథ ఇది

**కారకాస్, జులై 4(ఎ.ఎం.ఎస్) :** గత నెల సంభవించిన భూకంపం కారణంగా వెనిజులాలో కూలిపోయిన భవనం శిథిలాల కింద 43 ఏళ్ల సెక్యూరిటీ గార్డు హెర్నాన్ ఆల్బెర్టో గిల్ ఫ్లోర్స్ ఎనిమిది రోజుల పాటు చిక్కుకుపోయి, తాను బ్రతుకుతాడో లేదో తెలియని అనిశ్చితిలో ఉన్నాడు. చివరకు సహాయక సిబ్బంది అతని వద్దకు చేరుకున్నప్పుడు, అతను చేసిన మొదటి అభ్యర్థన హృదయాలను కదిలిస్తోంది. 'ఒకవేళ తాను ప్రాణాలతో లేకపోతే ఆమె బతకలేదు.. కాబట్టి తాను బ్రతికే ఉన్న విషయం తన భార్యకు చెప్పవద్దు' అతడు కోరాడు. గురువారం తెల్లవారుజామున గిల్ ఫ్లోర్స్ దుమ్ముతో నిండిన శరీరంతో స్ట్రెచర్‌పై పడుకుని, హెల్మెట్లు ధరించిన రక్షక సిబ్బంది మధ్య శిథిలాల నుంచి బయటకు వచ్చాడు. వెనిజులా వ్యాప్తంగా 2,200 మందికి పైగా ప్రాణాలను బలిగొన్న వినాశకరమైన భూకంపం తర్వాత, ఆయన ప్రాణాలతో బయటపడటం గొప్ప ఆశారేఖను నింపింది.



## ఖమేనీ మృతదేహానికి భారత బృందం నివాళులు

- దేశ ప్రజల తరపున సంతాపం, గౌరవం
- ఇరుదేశాల మధ్య బలమైన సంబంధాలున్నాయని వెల్లడి

**టెహ్రాన్, జులై 4:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయాతుల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంత్యక్రియల్లో భారత ప్రభుత్వం తరపున ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం పాల్గొని నివాళులర్పించింది. టెహ్రాన్‌లో జరుగుతున్న ఈ వీడ్కోలు కార్యక్రమాల్లో కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరీటా, బిహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్ (రిటైర్డ్) పాల్గొని భారత్ తరపున నివాళులు అర్పించారు. భారత ప్రభుత్వం, దేశ ప్రజల తరపున తమ సంతాపాన్ని, గౌరవాన్ని తెలియజేసినట్లు కేంద్ర మంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు.

అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఆయన అంత్యక్రియలకు భారత్ తరపున ఉన్నత స్థాయి ప్రతినిధులు హాజరుకావడం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ బంధాన్ని, ప్రజా సంబంధాల ప్రాధాన్యతను ఈ పర్యటన తెలియజేస్తుందని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇరు దేశాల రాజకీయ, ఆర్థిక బంధాలకు ఈ సంబంధాలే బలమైన పునాది అని స్పష్టం చేసింది. శని, ఆదివారాల్లో (45) టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేని మొసల్లా ప్రార్థనా మందిరంలో ఖమేనీ వీడ్కోలు కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం 6న టెహ్రాన్‌లో, 7న ఖోమ్ నగరంలో అంత్యక్రియల ఊరేగింపులు నిర్వహిస్తారు. చివరగా 9న మషద్‌లోని ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రంలో అంతిమ సంస్కారాలు, ఖనన ప్రక్రియ పూర్తి కానున్నాయి.



*భారత ప్రభుత్వం, దేశ ప్రజల తరపున తమ సంతాపాన్ని, గౌరవాన్ని తెలియజేసినట్లు కేంద్ర మంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన అంత్యక్రియలకు భారత్ తరపున ఉన్నత స్థాయి ప్రతినిధులు హాజరుకావడం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ బంధాన్ని, ప్రజా సంబంధాల ప్రాధాన్యతను ఈ పర్యటన తెలియజేస్తుందని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇరు దేశాల రాజకీయ, ఆర్థిక బంధాలకు ఈ సంబంధాలే బలమైన పునాది అని స్పష్టం చేసింది.*

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## జిల్లాలో జరుగుతున్న రహదారులు, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

**అభివృద్ధి పనుల్లో శాఖల సమన్వయంతో ముందుకు సాగాలి**

**జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి**

**జిల్లాలో ఆర్&బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై - 04**

జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో చేపట్టిన రహదారులు, వంతెనలు, భవనాలు తదితర అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ మిటింగ్ హాల్ లో ఆర్&బీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రహదారులు, భవనాల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న రహదారి నిర్మాణాల్లో ప్రజల ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పనుల అమలులో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం కేబుల్బ్రిడ్జి ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి పనులు, ముదిగొండ–వల్లభి ఫోర్‌లేన్ రహదారి నిర్మాణ పనులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత మెజర్‌మెంట్ ప్రకారం చేపట్టాలని సూచించారు. బోనకల్–ఆలపాడు రహదారి నిర్మాణంలో సంబంధిత తహసీల్దార్‌కు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించి, అనుమతులు వచ్చిన వెంటనే పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ నెలలో ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నందున సంబంధిత అన్ని అభివృద్ధి పనులు, ఏర్పాట్లను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్సూచించారు.సమావేశంలో అధికారులు తమ పరిధిలోని పనుల పురోగతిని వివరించగా, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్&బీ ఎస్ఈ యుగంధర్, ఈఈ బషీర్, సీతారామయ్య, డిఈ భగవాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## "6 నెలల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపాలి"

**జిల్లా కలెక్టర్లతో సీఎస్ సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్**



**సూర్యాపేట జులై 4; వుదయం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలని, రాబోయే 6 నెలల్లో గణనీయమైన మార్పులు తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు.శనివారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయం, ఆరోగ్యం, తాగునీరు, విద్య తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట ఐడీవోసీ నుంచి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు.సీఎస్ కీలక ఆదేశాలురైతులకు తెలుగులో SMSల ద్వారా సూచనలు, వాతావరణ సమాచారం పంపాలి. యూరియా సకాలంలో అందించి దుర్వినియోగాన్ని అరికట్టాలి. ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే, యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి.తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకూడదు. లీకేజీలు అరికట్టి నీటి వృథా నివారించాలి. మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రామాల్లో తాగునీటి పనులకు ప్రాధాన్యత ఇస్తూ సమర్థవంతంగా అమలు చేయాలి.చిన్న జిల్లాల్లో పరిపాలన మరింత సమర్థంగా ఉంటుందని, ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సీఎస్ అన్నారు.ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జెడ్పి సీఈవో శిరీష తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం – జిల్లా కలెక్టర్



**హనుమకొండ, జూలై 04 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ, అసంక్రమిత వ్యాధుల శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి- జిల్లా కలెక్టర్



**హనుమకొండ టౌన్, జూలై 04 (వుదయం ప్రతినిధి) :**

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్షయవ్యాధి (టీబీ), అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లాకలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు.శనివారం భీమారంలో ఏర్పాటు చేసిన టీబీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్ శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అనంతరం టీబీ బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా 'టీబీ ముక్త భారత్ అభియాన్' నడుస్తోందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేసి, నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అత్యాధునిక, ఖరీదైన చికిత్సను ఉచితం గా అందిస్తుందని చెప్పారు. చికిత్స కాలంలో 'నిక్షయ్ పోషణ్ యోజన' ద్వారా ప్రతినెల రూ.1,000 నేరుగా రోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, ముందస్తు నిర్ధారణతో ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు.శిబిరంలో అందిస్తున్న సేవలు:30 ఏళ్లు పైబడిన వారికి: రక్త పోటు (BP), మధుమేహం (షుగర్), నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు. హైరిస్క్ వర్గాల వారికి: 60ఏళ్లు పైబడిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు,పాతటీబీరోగులు, ధూమ పానం చేసేవారికి 'మొబైల్ డిజిటల్ ఎక్స్‌రే' ద్వారా ఉచిత పరీక్షలు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చర్లలో 12 అంగన్వాడీ టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఐసిడిఎస్ పిఓ రేవతి



**చర్ల, జూలై 4: (వుదయం ప్రతినిధి)**

చర్ల మండలంలో అంగన్వాడీ టీచర్లు పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాలలో టీచర్ల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందని, ఆసక్తిగల అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ చర్ల ప్రాజెక్టు అధికారి రేవతి తెలిపారు. చర్ల ప్రాజెక్టు పరిధిలో ఆర్ కొత్తగూడెం, కుదునూరు, జిపి పల్లి, బూరుగుపాడు కిష్టారం పాడు, కొండెవాయి, కొర్కట్ పాడు, రామచంద్రపురం, ఉప్పరి గూడెం, గొంపల్లి, కొయ్యూరు, రామానుజపురం గ్రామాల అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయనున్నామని వీటిలో 9 పోస్టులు ఎస్టీ అభ్యర్థులకు, మూడు పోస్టులు ఎస్సీ అభ్యర్థులకు రిజర్వు చేశారని తెలిపారు. అంగన్వాడీ టీచర్ పోస్టుకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ (10+2) కలిగిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామానికి చెంది 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయసు గల మహిళ అయి ఉండాలన్నారు. దరఖాస్తు తో పాటు విద్యార్హతలు, కుల, నివాస, జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు బ్యాంకు ఖాతా పుస్తకం, ఓటరు గుర్తింపు కార్డు తదితర పత్రాల నకళ్ళు సమర్పించాలని సూచించారు. ఆన్లైన్ దరఖాస్తు సమయం ముగిసిన తర్వాత జూలై 20వ తేదీ నుండి ఆగస్టు 7 వరకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారని ఆమె తెలిపారు. అభ్యర్థులు అధికారిక వెబ్సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని గతంలో ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులు చెల్లబోవని అన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం లేదా అధికారిక వెబ్ సైట్ లో తెలుసుకోవచ్చని తెలియజేశారు.

## దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

**దొడ్డి కొమురయ్య నడయాడిన జిల్లాలో సేవలందించడం**

**గర్వకారణం: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, జూలై 04 (వుదయం ప్రతినిధి):**

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని జిల్లాకలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు.శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 81వ వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమర వీరుడైన దొడ్డి కొమురయ్య నడయాడిన జనగామ జిల్లాలో పనిచేసే అవకాశం లభించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని చిరస్థాయిగా నిలుపుకునేలా ఆయన పేరిట భవన నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన భూమిని ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు.ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యువత దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.మునిసిపల్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో వెనుకబడిన తరగతుల కులాలకు అండగా నిలబడిన దొడ్డి కొమరయ్య మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు.ఈ క్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఆశయాలైన సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహ రావు, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, వైటిడిఎ సభ్యులు లక్ష్మి నారాయణ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, సీనియర్ పాత్రికేయులు కన్నా పరశురాములు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కంచె రాములు, పట్టణ అధ్యక్షులు బల్దే మల్లేశం, పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి ఎండ్రు వైకుంఠం, యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు కానుగంటి ముత్తయ్య, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల బాలరాజు, రజక సంఘం జిల్లా సెక్రటరీ ఎదునూరి మాదార్, కల్లు గీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బల్దే వెంకట మల్లయ్య, కోపా అధ్యక్షులు కర్రే కృష్ణ, జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు బుచ్చయ్య, అభినాష్, ఇతర కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ఐడిఓసి సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబాపై పోలీసుల ఉక్కుపాదం

**10 లీటర్ల గుడుంబా స్వాధీనం**

**100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం: ఎస్సై సాయి శశాంక్**



**పలిమేల జులై 04(వుదయం ప్రతినిధి)**

పలిమేల మండలంలో గుడుంబాస్థావరాలపై దాడులు నిర్వహించినట్లు పలిమెల ఎస్సై సాయి శశాంక్ తెలిపారు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు శనివారం పలిమేల మండలంలో అక్రమ మద్యం తయారీ, విక్రయాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మూరు గ్రామంలో గుడుంబాపై దాడి నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ దాడిలో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లం పానకంను అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగిందని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమంగా గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా గుడుంబా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## భూముల రీసర్వే, ఎస్ఐఆర్ గ్రామసభ అవగహన సదస్సు తహసీల్దార్ టి. వెంకటస్వామి



**పర్వతగిరి, జులై 4 ( వుదయం ప్రతినిధి) :**

పర్వతగిరి మండలం జమాల్ పురం గ్రామంలో భూముల రీ సర్వే ఎస్ఐఆర్ మీద జున్ను కనకయ్య యాదవ్ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ అవగాహన సదస్సు ఏర్పాటు చేయనైనది. ఇట్టి గ్రామసభకు ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ వరంగల్ శ్రీనివాస్, అలాగే టెక్నికల్ పర్సన్స్, అడిషనల్ గిరి ధావర్, మండల సర్వేయర్, జిపిఓ సోమారం, బిఎల్వోలు పాల్గొన్నారు. శనివారం నుండి జమాల్ పురం గ్రామము యొక్క బౌండరీ ఫిక్సేషన్, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు అలాగే వ్యవసాయ భూములను మొత్తము సర్వే చేయుటకు రీ సర్వే ప్రోగ్రాం ప్రారంభమగును. కావున భూ యజమానులు అందరూ తాము సాగు చేస్తున్న భూమి మోకాను సదరు సర్వేర్ లకు చూపించవలసిందిగా తహసిల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఆడిషనల్ ఎస్పీ




**జయశంకర్ భూపాలపల్లి జులై 04 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, శనివారం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించాలి**

**ఈనెల 10వ తేదీన విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలి**

**ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర. కిరణ్**



**భూపాలపల్లి జూలై 4 వుదయం ప్రతినిధి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుమ్మరి రాజుకుమార్ బొడ్డు స్మరణ్ ఆధ్వర్యంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా గైడ్ కామ్రేడ్ దామెర. కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఖాళీగా ఉన్న ఎంఈఓ డీఈవో పోస్టులు తక్షణమే భర్తీ చేయాలి రాష్ట్రంలో 27 వేల పాఠశాలను 4 వేలకు చేర్చడం పై నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని విద్యా హక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా కల్పించాలని అన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయని అన్నారు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మేము అధికారంలోకి రాగానే విద్యా రంగానికి అధిక శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విద్యార్థులని మోసం చేసింది అన్నారు అదేవిధంగా రాష్ట్రంలో చదువుకునే ప్రతి విద్యార్థికి విద్యా భరోసా కార్డు ఐదు లక్షల వరకు కేటాయించి ఇస్తామని అన్నారు కానీ ఇప్పటివరకు ఇవ్వలేదు తక్షణమే దీనిని అమలు చేయాలని అన్నారు అదేవిధంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి అన్నారు, రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలను 4 వేలకు మాత్రమే పరిమితం చేస్తారని నిర్ణయం చేసిన దానిని తక్షణమే ఆ యొక్క నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు, నూతన జాతీయ విద్యా విధానం 2020 అని రద్దుచేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలని అన్నారు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ మరియు డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు అనంతరం వారు మాట్లాడుతూ అద్దె భవనాలల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు వెంటనే ఏర్పాటు చేయాలి అన్నారు, స్కూల్స్ ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో బుక్స్ మరియు యూనిఫార్మ్స్ రాలేదని అన్నారు తక్షణమే విద్యార్థులకు బుక్స్ మరియు యూనిఫామ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు,ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ్డు స్మరణ కుమ్మరి రాజు జిల్లా ఆఫీస్ ప్లేయర్స్ శ్రావణ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య వర్ధంత ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూలై 4**

అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, సమాజంలో న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ ఆదర్శంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డీబీసీడీఓ పుష్పలత, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని అమరవీరుడు దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులర్పించారు.

## అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం



**జయశంకర్ భూపాలపల్లి జులై 04(వుదయం జిల్లా ప్రతినిధి)**

వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం. షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాకలెక్టర్లు, జిల్లాధికారులతో ప్రాధాన్యత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని సమావేశానికి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికి కొన్నిశాఖల అధికారులు గైర్హాజరు కావడంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్మాట్లాడుతూ సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ప్రాధాన్యతను తెలిపి, ముందస్తుగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విధుల్లోనిర్లక్ష్యం వహిస్తూ సమావేశానికి రాని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరు అయిన సదరు అధికారులకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, సమీక్షా సమావేశాల పట్ల అధికారుల అలసత్వాన్ని సహించేది లేదన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ కనువిప్ప కోసమే కేటీఆర్ పర్యటన



**జయశంకర్ భూపాలపల్లి జులై 04 (వుదయం జిల్లా ప్రతినిధి)**

గోదావరినదిలో వృధాగా పోతున్న నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కన్నెపల్లి పంపుహౌజ్ పర్యటన చేపట్టినట్లు మంథనిమాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తెలిపారు. ఈ నెల 05న కేటీఆర్ పర్యటన నేపథ్యంలో శనివారం ఆయన కన్నెపల్లి పంపుహౌజ్‌ను సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు దెబ్బతిన్నాయన్న సాకుతో ప్రభుత్వం రెండేళ్లుగా ప్రాజెక్టులో నీళ్లు ఆపడం లేదన్నారు. మేడిగడ్డ బరాజ్‌కు సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌజ్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని, ప్రతి రోజు ఒక టీఎంసీ నీరు వృదాగా పోతున్నా ముఖ్యమంత్రి, స్థానికి ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని అన్నారు. రెండేళ్లుగా ప్రాజెక్టుల్లో నీళ్లు ఆపకపోవడం మూలంగా ఈ ప్రాంతంలో భూగర్బజలాలు అడుగంటిపోయి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే మాజీ మంత్రి, భిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంపుహౌజ్ సందర్శన చేపట్టినట్లు ఆయన వివరించారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆన్కారి ప్రకాష్, అలీం, పవన్, తడకల రమేష్, తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

# ఘనంగా దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి

**–ఆయన ఆశయ సాధనకు ఉద్యమిద్దాం: సీపీఐ రాష్ట్ర నేత నేదునూరి జ్యోతి**




కాజీపేట, జూలై 04 (వుదయం ప్రతినిధి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి వేడుకలు కాజీపేట మండలం మడికొండ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కాజీపేట మండల సీపీఐ కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...పోరాట స్ఫూర్తి: 1946 జూలై 4న విసునూరు దేశ్‌ముఖ్, నైజాం నవాబుల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 18 ఏళ్ల యువకుడు దొడ్డి కొమురయ్య వీరమరణం పొందారని కొనియాడారు. ఆయన అమరత్వం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. ఐక్యతకు పిలుపు: భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి, వెట్టిచాకిరీని నిరసించిన కొమురయ్య స్ఫూర్తితో నేటి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యమై మరో పోరాటానికి సిద్ధం కావాలని కోరారు.?ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం, నాయకులు మునిగాల భిక్షపతి, బొట్టు భిక్షపతి, రాసమళ్ల దీన, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, బరిగెల గురుస్వామి, భానోత్ మనేమ్మ, ప్రణీత, పద్మ, మోడం రాజేందర్, రిల్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలో బిఆర్ఎస్ నేతలు...




రాయపర్తి, జూలై 4 (వుదయం ప్రతినిధి): వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారంఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం సుమారు 500 మందికి మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు, అభిమానులు, ప్రయాణికులకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు మునవత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామ్ చంద్రా రెడ్డి, మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, రామ్ చందర్, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, సంకినేని ఎల్లస్వామి, మండల కమిటీ నాయకులు, సర్పంచ్‌లు, యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

**: కాంగ్రెస్ సీనియర్ నాయకులు**



కాజీపేట, జూలై 04 (వుదయం ప్రతినిధి):అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, హరిప్రసాద్, కిషోర్ పిలుపునిచ్చారు. శనివారం కాజీపేట్ మండలం 48వ డివిజన్ దర్గా ప్రాంతంలో జరుగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను వారు కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ శారద, బీఎల్ఏ అరుణలతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ, మ్యాపింగ్, అన్‌మ్యాపింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా సమీక్షించారు. ముఖ్య సూచనలు: అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి విడిచిపోకుండా చూడాలి.

ప్రతి దరఖాస్తును ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించి, పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి. బీఎల్ఓలు, బీఎల్ఏలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ పారదర్శక ఓటరు జాబితాను రూపొందించాలి.

ఈ సందర్భంగా వారు స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, ఓటు నమోదుకు సంబంధించిన సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని వారు కోరారు.

# మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఘనంగా జన్మదిన వేడుకలు



ఐనవోలు, జులై 4 ( వుదయం ప్రతినిధి ) :వరంగల్ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాజీ వైస్ ఎంపీపీ తంపుల మోహన్ రావు ఆధ్వర్యంలో పర్వతగిరి ముద్దుల బిడ్డ
ప్రజల మనిషి..."అన్నా" అంటే నేనున్నానంటూ ప్రతి క్షణం ప్రజల కష్టసుఖాల్లో భాగమై, ప్రజాసేవలో ముందుండే నాయకులు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు (దయన్న) జన్మదిన సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర కెక్ కట్ చేసి ఐనవోలు మండల బిఆర్ ఎస్ నాయకులు

హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయన్న ఆయురారోగ్యాలతో, ఆనందంగా, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో ఇలాగే ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమ వేడుకల్లో అయినవోలు మండల వర్కింగ్ ప్రెసిడెంట్, నందనం సొసైటీ వైస్ ప్రెసిడెంట్ తక్కలపల్లి చందర్ రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గడ్డం రఘువంశీ గౌడ్ , మాజీ జడ్పీ కో. ఆప్షన్ సభ్యులు, పున్నెల్ సర్పంచ్ ఎస్ కె. ఉస్మాన్ అలీ , కొండపర్తి సర్పంచ్ కంజర్ల అశోక్ రావు , గుండేటి ఏలీయా, మాజీ సర్పంచ్ కావేటి స్వామి , దుప్పెల్లి స్వామి, మాజీ ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్ , పట్టపురం ఎల్లగౌడ్ , మరుపట్ల దేవదాస్ , మరుపట్ల నరేష్ , కట్కూరి రాజు , బరిగేలా ఏలీయా , గద్దల ప్రభాకర్ , కావటి రాజు , పిడుగు రవీందర్ , తాళ్లపెల్లి రాజు , కట్టబోయిన చందు, తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాల సన్నద్ధతపై క్షేత్రస్థాయి తనిఖీలు

**– మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న**

వరంగల్ టౌన్, జూలై 04 (వుదయం ప్రతినిధి) : వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నాలాలు, చెరువులు, పారిశుధ్య నిర్వహణ పనులను వేగవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.
శనివారం కమిషనర్ హనుమకొండలోని ఎస్ బీహెచ్ కాలనీ, వడ్డేపల్లి చెరువు, సమ్మయ్యనగర్, బృందావన్ కాలనీ, పద్మాక్షి ఆలయ పరిసరాలు, అదేవిధంగా వరంగల్‌లోని బొందివాగు, అంబేద్కర్ నగర్, కరీమాబాద్, చిన్న వడ్డేపల్లి చెరువు, ఆటోనగర్ ప్రాంతాల్లో పర్యటించి నాలాలు, పారిశుధ్య నిర్వహణ, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు.
వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, పూడిక, చెత్త తొలగింపు పనులను వేగవంతం చేయాలని, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ డా. రాజా రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేయడమే మా లక్ష్యం

*గ్రామ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొనాలి.*
*విద్యుత్ కు అంతరాయం లేకుండా చెట్ల కొమ్మలను నరికిస్తున్న పాలకవర్గం.*
*సొసైటీ మాజీ డైరెక్టర్, ప్రస్తుత నూతన సొసైటీ పర్సన్.*





ఖానాపురం, జులై 4 (వుదయం ప్రతినిధి):గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం గ్రామంలోని అన్ని పార్టీలు ఏకమై గ్రామ అభివృద్ధిలో పాలు పాలుపంచుకొని గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా ముందుకు వెళ్లాలని అన్ని పార్టీలకు గ్రామ ప్రజలకు మాజీ సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్ యాదవ్, ప్రస్తుత నూతన సొసైటీ పర్సన్ శివరాత్రి వెంకటయ్య గ్రామ ప్రజలకు తెలిపారు. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలో వర్షాకాలంలో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా కరెంటు వైర్ల క్రింద ఉన్న చెట్ల కొమ్మలను గ్రామ సర్పంచ్ పాలకవర్గం తోపాటు ప్రస్తుత నూతన సొసైటీ పర్సన్ మరియు మాజీ సొసైటీ డైరెక్టర్ విద్యుత్ అధికారులు అందరూ కలిసి కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా కూలీలతో చెట్ల కొమ్మలను నరికిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరూ కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా ముందుకు వెళ్లాలని గ్రామ ప్రజలకు సొసైటీ ప్రస్తుత పర్సన్ మాజీ డైరెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రమీల, గ్రామస్తులు వల్లెపు వెంకన్న, జానీ, విద్యుత్ శాఖ సిబ్బంది రాజు, జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంటిటీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న సాత్వికకు అభినందనలు



హనుమకొండ టౌన్, జూలై 04 (వుదయం ప్రతినిధి) :
జాతీయ ఉన్నత గణిత మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ప్రతిభా వికాస శిక్షణ శిబిరం (ఎంటిటీఎస్)కు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన తుది సంవత్సరం విద్యార్థిని సాత్విక ఎంపికైంది. దేశవ్యాప్తంగా 40 మంది విద్యార్థులను ఎంపిక చేసిన ఈ శిబిరానికి తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపిక కాగా, వారిలో సాత్విక ఒకరు. కేరళలోని తిరువనంతపురంలో నెలరోజుల పాటు గణితశాస్త్ర ప్రాథమిక అంశాలతో పాటు బీజగణితం, వాస్తవ విశ్లేషణకు సంబంధించిన అంశాలను ప్రముఖ అధ్యాపకులు బోధించారు. శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన సాత్వికను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, గణితశాస్త్ర విభాగాధిపతి నాగయ్య, అధ్యాపకులు రవికుమార్, మంజుల, శ్రీలక్ష్మి, మౌనిక తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

**పర్వతగిరి మండలఅల్లూరి యూత్ అధ్యక్షుడు నాగుల రాజు**



పర్వతగిరి, జూలై 04 ( వుదయం ప్రతినిధి ) :స్వాతంత్ర్య సంగ్రామ విప్లవ జ్యోతి, మన్యం వీరుడు, సాయుధ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పర్వతగిరి మండల కేంద్రంలో అల్లూరి యూత్ అధ్యక్షుడు నాగుల రాజు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ చీదురు శంకర్, మాడుగుల రాజు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు భారత జాతికి స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర చరిత్రలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. న్యాయం కోసం పోరాడే సంకల్పం, దేశం పట్ల అంకితభావం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు ఆశయాలను కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తుంగ రాజు, అల్లూరి యూత్ ఉపాధ్యక్షులు మాడుగుల అఖిల్, చీదురు తిరుపతి, గోనె వెంకన్న, ఎడెల్లి ప్రదీప్, చెనమాల నరసయ్య, బోనగిరి దుర్గేష్, పటేల్ శ్రీకాంత్, విష్ణు, రాజు, సాయి, రమేష్, చంద్రయ్య, ప్రశాంత్, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్**



పర్వతగిరి , జులై 4 ( వుదయం ప్రతినిధి ) : పర్వతగిరి మండల కేంద్రంలో రాష్ట్ర మాజీ మంత్రి, పర్వతగిరి ముద్దుబిడ్డ, ప్రజానేత ఎర్రబెల్లి దయాకర్ రావు 70వ జన్మదిన వేడుకలను మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఎర్రబెల్లి దయాకర్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ.."అన్న అని పిలిస్తే అర్ధరాత్రి అయినా స్పందించే నాయకులు ఎర్రబెల్లి దయన్న . పదవి అంటే సేవ చేయడానికే అని నిరూపించిన సేవామూర్తి. తెలంగాణ రాష్ట్ర మంత్రిగా కెసిఆర్ నాయకత్వం లో రాష్టంలో, వరంగల్ ఉమ్మడి జిల్లా లో వర్ధన్నపేట నియోజకవర్గం పాలకుర్తి నియోజకవర్గానికి
చేసిన సేవలు ఒక్కొక్కటి ఒక మైలురాయి. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు, ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు, పేదోడి సొంతింటి కల నెరవేర్చిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు, పల్లె ప్రగతి – పట్టణ ప్రగతి బాటలు వేసిన దార్శనికత మన పర్వతగిరి ముద్దుల బిడ్డ ఎర్రబెల్లి దయన్న దని ఆరూరి రమేష్ కొనియాడారు.
కార్యకర్త కష్టాన్ని తన కష్టంగా భావించి, కన్నీళ్లు తుడిచే పెద్దదిక్కు దయన్న. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యనే ఉండే నిరాడంబరతే దయన్న కేసీఆర్ నమ్మిన బంటుగా, కారు గుర్తుకు ఊపిరిగా నిలిచిన దయన్న నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలి. మళ్లీ మంత్రిగా గెలిచి, వరంగల్ జిల్లా గడ్డ మీద గులాబీ జెండా రెపరెపలాడించాలని మనస్ఫూర్తిగా ఆరూరి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పర్వతగిరి మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు,పర్వతగిరి సొసైటీ చైర్మన్ యం. మనోజ్ గౌడ్, స్థానిక మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, సర్పంచులు, తౌటి శ్రీలత దేవేందర్,దారావత్ లక్ష్మి బాలాజీ, ఎలికట్టె కృష్ణవేణి వేణు, డెక్క సునీత కుమారస్వామి, మాజీ సర్పంచులు అమడగని రాజు యాదవ్,కొల్లూరి వెంకటేశ్వర్లు, గొనె సంపత్, బొట్ల కిష్టయ్య, బానోత్ వెంకన్న,కిషోర్,మండల నాయకులు చిన్నమాధవరావు , బొట్ల మధు, పిండి వెంకటేశ్వర్లు,మెరుగు వెంకటేశ్వర్లు జంగిలి బాబు,జీడీ గట్టయ్య, బల్లె వెంకట్రాజు, పేర్వారం రతన్, మేకిరి మల్లికార్జున్, తిరుపతి,రంగు కుమార్ (ఫర్టిలైజర్ )చిరుత విజయ్, దొమ్మటి రాజు, కాంటెమ్ ఏకాంతం,తుంగ రాజు,మధుకర్ రెడ్డి భాస్కర్,అర్షం కుమార్,చీదురు రమేష్ దుండి హరీష్, మాడుగుల అఖిల్, మాడుగుల విషు, పటేల్ శ్రీకాంత్ గొనె రాజ్ కుమార్,సోషల్ మీడియా నాయకులు బొట్ల భాస్కర్, దబ్బేట నరేష్, చిన్నపెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సిపి ని మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు



హనుమకొండ క్రైం, జూలై 04 (వుదయం ప్రతినిధి) : నూతనంగా వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతను హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (హనుమకొండ జిల్లా శాఖ, రాష్ట్ర పాలక మండలి) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కు పూలమొక్కతో పాటు, రెడ్ క్రాస్ సొసైటీ యొక్క ఏడు ప్రాథమిక సూత్రాలను ప్రతిబింబించే ప్రత్యేక మెమెంటోను అందజేశారు. అనంతరం, జిల్లాలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, విపత్తు సహాయక చర్యలు మరియు భవిష్యత్ ప్రణాళికలను సభ్యులు సిపికి వివరించి, తమ కార్యాలయాన్ని సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.?సిపి ఎన్. శ్వేత స్పందిస్తూ రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, త్వరలోనే వారి కార్యాలయాన్ని సందర్శిస్తానని సిపి తెలిపారు. ముఖ్యంగా రక్తదాన కార్యక్రమాలకు, ఇతర సేవా విభాగాలకు పోలీస్ శాఖ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం..

**ఈ నెల 6న రాయపర్తిలో స్పాట్ కౌన్సిలింగ్...**



రాయపర్తి, జూలై 4 (వుదయం ప్రతినిధి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని జూనియర్ కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న ఇంటర్మీడియట్ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త సముద్రాల సరిత తెలిపారు. రాయపర్తి, పర్వతగిరి, దుగ్గొండి బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులతో పాటు నర్సంపేట బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 6వ తేదీ (సోమవారం) రాయపర్తి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు)లో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 2026 మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించిన పదో తరగతి (ఎస్ఎస్సీ) పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే కౌన్సిలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే నిర్వహించబడుతుందని, ఆ తర్వాత హాజరయ్యే విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషన్ అవకాశం ఉండదని స్పష్టం చేశారు. స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఎస్ఎస్సీ మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టి.సి.), స్టడీ/బోనాఫైడ్ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం తదితర అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త సముద్రాల సరిత కోరారు.

## 17 నెలల కనిష్ఠానికి సేవల రంగ వృద్ధి



జూన్‌లో దేశీయ సేవల రంగ వృద్ధి 17 నెలల కనిష్ఠమైన 57.4 పాయింట్లుగా నమోదైంది. సవాళ్లతో కూడిన పరిస్థితులకు తోడు, కొన్ని రకాల సేవలపై క్లయింట్లకు ఆసక్తి తగ్గడం ఇందుకు కారణమని ఓ నెలవారీ నివేదిక తెలిపింది. నియామకాలు, వ్యాపార విశ్వాసంపై ఈ పరిణామాలు ప్రభావం చూపాయని వెల్లడించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సేవల వ్యాపార కార్యకలాపాల పీఎంఐ సూచీ జూన్‌లో 57.4 పాయింట్లకు తగ్గింది. ఇది 17 నెలల కనిష్ఠస్థాయి. ఈ ఏడాది మేలో ఇది 59.8 పాయింట్లుగా ఉంది. పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే వృద్ధి ఉన్నట్లే. అయితే అంతకుముందు నెలలతో పోలిస్తే, జూన్‌లో తక్కువగా ఉండటం వల్ల వృద్ధి నెమ్మదించినట్లు లెక్క.




# మూడేళ్లలో రూ.40,000 కోట్ల పెట్టుబడులు



మౌలిక సదుపాయాల రంగంలోని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూపు, రాబోయే మూడేళ్లలో రూ.30,000– 40,000 కోట్ల మూలధన పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ పెట్టుబడులతో రాబోయే అయిదేళ్లలో గ్రూపు వార్షికాదాయాన్ని రూ.2 లక్షల కోట్లకు చేర్చడమే లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. వ్యాపార విస్తరణతో పాటు, ప్రతి రెండేళ్లకోసారి తమ అనుబంధ సంస్థలను పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు తీసుకురావాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. తొలుత ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను, ఆ తర్వాత రక్షణ విభాగం, గ్యాస్ పంపిణీ సంస్థలను స్టాక్‌మార్కెట్లో నమోదు చేస్తామన్నారు. హైదరాబాద్ సహా దేశంలోని పలు నగరాల్లో విద్యుత్ బస్సులను ఈవీ ట్రాన్స్ నడుపుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో గ్రూపు మొత్తం ఆదాయం రూ.60,000 కోట్ల వరకు ఉందని, ఈ ఆర్థికంలో రూ.80,000 కోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్నామని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గ్రూప్ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు ఏడాదికి 10,000 విద్యుత్ బస్సుల తయారీ సామర్థ్యం కలిగిన ప్లాంట్ తెలంగాణలో ఉందన్నారు. ప్రస్తుతం ఈ ప్లాంటు నుంచి 4,000 బస్సులను ఉత్పత్తి చేస్తుండగా, చేతిలో ఇంకా 8,000– 10,000 బస్సులకు ఆర్డర్లున్నాయని తెలిపారు. విద్యుత్తు బస్సులకు పెరుగుతున్న గిరాకీని అందుకునేందుకు మరో రెండు ప్రాంతాల్లో తయారీ ప్లాంట్లు నిర్మించాలని యోచిస్తున్నామని.. ఇందుకోసం పలు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఎంఈఐఎల్ గ్రూపు ప్రస్తుతం 40,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని, మరో 3 లక్షల మందికి పరోక్షంగా జీవనోపాధి అందిస్తున్నట్లు తెలిపారు.

# 15% ఐసోబ్యుటనాల్ కలపడంపై కేంద్రం దృష్టి!

ముడి చమురు దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు కేంద్రం మరో ప్రయత్నం చేస్తోంది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యుటనాల్ (15% isobutanol) కలపడంపై దృష్టి సారించింది. దేశంలో ఇంధన భద్రతను మెరుగుపరిచేందుకు, రవాణా రంగంలో కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఇది దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు ప్రత్యామ్నాయ ఇంధన వ్యూహంపై కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యనించారు. డీజిల్‌తో ఇథనాల్‌ను నేరుగా కలపడం సాధ్యం కాదు. అందుకే ఇథనాల్ నుంచి ఐసోబ్యుటనాల్ తయారీకి కృషి చేస్తున్నాం. ఇది డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా మారుతుంది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యుటనాల్ కలపడంపై ప్రభుత్వం పనిచేస్తోంది. ఇంధనం స్వయం సమృద్ధికి ఇది కీలక అడుగుగా మారనుంది'' అని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన పైలట్ ప్రాజెక్టు కూడా ప్రోత్సాహకర ఫలితాలు ఇచ్చిందన్నారు. 100 శాతం ఇథనాల్, ఐసోబ్యుటనాల్‌తో నడిచే రెండు రకాల ఇంధనాలను తయారు చేశామని, ఇందుకు ఇంజిన్‌లు కూడా సపోర్టు చేస్తాయన్నారు. కాగా, భవిష్యత్తు జీవ ఇంధనంగా ఐసోబ్యుటనాల్ మారనుందని సంబంధిత అధికారులు ఆశిస్తున్నారు. ఇతర బయో ఫ్యూయెల్స్ కంటే తక్కువ కర్బన ఉద్గారాలు వెలువడటం, ఇంజిన్ నాణ్యత మెరుగవ్వడమే ఇందుకు కారణం. దీంతో దేశీయంగా జీవ ఇంధనాల డిమాండ్ పెరగడంతో



ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవచ్చు. విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. పంట వ్యర్థాల నుంచి ఐసోబ్యుటనాల్‌ను ఉత్పత్తి చేయొచ్చు కాబట్టి.. రైతులూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తారు.

# పైరసీపై చర్యలు.. టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసులు



ఆన్‌లైన్

మెసేజింగ్ యాప్‌లలో భద్రతపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా టెలిగ్రామ్‌కు నోటీసులు జారీ చేసింది. కాపీరైట్ ఉల్లంఘనకు పాల్పడుతోన్న ఛానళ్లు, కంటెంట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ టెలిగ్రామ్‌ను ఆదేశించింది. ఎటువంటి చర్యలు తీసుకున్నారనే దానిపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అల్టిమేటం ఇచ్చిం ది. వీలైనంత త్వరగా పైరసీ కంటెంట్‌ను తొలగించాలని ఆదేశించింది. కాపీరైట్ ఉల్లంఘన అనేది కేవలం సివిల్ కేసు మాత్ర మే కాదని.. ఇది క్రిమినల్ నేరం అవుతుం దని కేంద్రం ఈ సందర్భం గా పేర్కొంది. టెలిగ్రామ్ వేదికగా పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్ ఎక్కువగా షేర్ అవుతు న్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. ప్రొడ్యూసర్లు, ఓటీటీ ప్లాట్ ఫామ్‌లు, దర్యా ప్తు సంస్థల కోసం ఎలాంటి గ్రీవెన్స్ వ్యవస్థ ను ఏర్పాటు చేశారో తెలియజేయాలని టెలిగ్రామ్‌ను కేంద్రం ఆదేశించింది. ఇటీవ ల నీట్ పరీక్ష ప్రశ్నపత్రాలు టెలిగ్రామ్‌లో లీక్ అయినట్లు ఆరోపణలు రావడంతో.. కేంద్రం కొన్ని రోజుల పాటు ఈ మెసేజింగ్ యాప్‌ను దేశంలో బ్లాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా దీనికి నోటీసులు జారీ చేయడం గమనార్హం. మరోవైపు చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలు, సైబర్‌మోసాల ముప్పు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఇన్‌స్టాగ్రామ్, మెటాకు నోటీసులు జారీ చేసింది. వివాదాస్పద ప్రకటనలపై వివరణ ఇవ్వాలని మెటాను ఆదేశించింది.

# మూడో రోజూ మెరిశాయ్..ఐటీ షేర్లలో కొనుగోళ్ల అండ

వరుసగా మూడో రోజూ మన స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదం చేశాయి. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాల కంటే తక్కువగా నమోదైనందున, సమీపకాలంలో ఆ దేశ కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్లు పెంచకపోవచ్చనే అంచనాలు.. మన మార్కెట్ సెంటిమెంట్ బలపడటానికి దోహదం చేశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 17 పైసలు పెరిగి 95.18 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.14% పెరిగి 71.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.39,000 కోట్లు పెరిగి రూ.480.19 లక్షల కోట్ల (5.04 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. తగ్గిన లాభాలు...: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 78,152.34 పాయింట్ల వద్ద లాభాల్లో ఆరంభమైంది. ఆ తర్వాత ఒడుదొడుకుల మధ్య సూచీ కదలాడింది. మధ్యాహ్నం తర్వాత లాభాలు తగ్గుతూ వచ్చినా, చివరకు 261.79 పాయింట్ల లాభంతో 77,763.91 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 95.15 పాయింట్లు పెరిగి 24,270.85 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,252.35 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,378.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 663 పాయింట్లు, నిఫ్టీ 215 పాయింట్లు పెరిగాయి. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్ 5.79%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.13%, టెక్ మహీంద్రా 1.81%, భారతీ ఎయిర్‌టెల్ 1.81%, సన్ ఫార్మా 1.77%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.62% పెరిగాయి. యాక్సిస్ బ్యాంక్ 1.56%, ఎస్‌బీఐ 1.13%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.11%, ఎల్‌అండ్‌టీ 0.83% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో స్థిరాస్తి, ఐటీ, ఆరోగ్య సంరక్షణ, కమొడిటీస్, లోహ, టెలికాం రాణించగా... విద్యుత్, భారీ యంత్రపరికరాలు, ఇండస్ట్రియల్స్, వాహన డీలాపడ్డాయి. బీఎస్ఈలో 2,257 కంపెనీల షేర్లు లాభాల్లో; 1,986 కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. 198 కంపెనీల షేర్ల ధరలో మార్పు లేదు. మన విదేశీ మారకపు నిల్వలు జూన్ 26తో ముగిసిన వారంలో 5.654 బిలియన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 150 మిలియన్ డాలర్లు తగ్గి 541.067 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి నిల్వల విలువ 5.394 బిలియన్ డాలర్లు తగ్గి 102.536 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 89 మిలియన్ డాలర్లు తగ్గి 18.558 బిలియన్ డాలర్లకు; ఐఎంఎఫ్ వద్ద భారత నిల్వల స్థితి 21 మిలియన్ డాలర్లు తగ్గి 4.773 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.







## స్విస్.. 92 ఏళ్ల తర్వాత



స్విట్జర్లాండ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో 94 ఏళ్ల విరామం తర్వాత ఓ నాకౌట్ మ్యాచ్ గెలిచింది. 32 జట్ల రౌండ్‌లో ఆ టీమ్ 2–0తో అల్జీరియాను ఓడించి ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. ఈ మ్యాచ్ ఆరంభం నుంచే చాలా దూకుడుగా ఆడిన స్విస్.. 10వ నిమిషంలోనే ఫలితం రాబట్టింది. టోర్నీలో మంచి ఫామ్ కనబరుస్తున్న ఎంబోలో చక్కటి గోల్‌తో జట్టును ఆధిక్యంలో నిలిపాడు. ప్రథమార్ధంలో మరో గోల్ నమోదు కాలేదు. అయితే ద్వితీయార్ధం మొదలవగానే స్విస్ ఆధిక్యం రెట్టింపైంది. 46వ నిమిషంలో డాన్ ఎండోయ్ స్కోర్ చేశాడు. తర్వాత మ్యాచ్‌లో గోల్ నమోదు కాలేదు. చివరగా స్విస్.. 1934లో నాకౌట్ మ్యాచ్ గెలిచింది. కొలంబియా–ఘనా మ్యాచ్ విజేతతో మంగళవారం స్విట్జర్లాండ్ ప్రిక్వార్టర్స్ ఆడుతుంది.

# రోజర్ ఫెదరర్‌తో '106'వ మ్యాచ్‌ను పెట్టండి: నొవాక్ జకోవిచ్



వింబుల్డన్‌లో టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ (Novak Djokovic) 105వ మ్యాచ్‌ను గెలిచాడు. దీంతో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ సరసన జకోవిచ్ నిలిచాడు. ఫెదరర్ కూడా వింబుల్డన్‌లో 105 విజయాలను నమోదు చేశాడు. అయితే, ఈ రికార్డును జకో బ్రేక్ చేయడం పెద్ద కష్టమేం కాదు. ఈ టోర్నీలో ఇది ఇంకా మూడో రౌండే. ముున్ముందు చాలా మ్యాచులు ఉన్నాయి. ఓవరాల్‌గా సింగిల్స్‌లో మార్టినా నవ్రతిలోవా అత్యధికంగా 120 మ్యాచుల్లో గెలిపొందింది. పురుషుల విభాగంలో మాత్రం ఫెదరర్ – జకోవిచ్ సమంగా నిలిచారు. మూడో రౌండ్‌లో గెలిచిన తర్వాత.. వింబుల్డన్ నిర్వాహకులకు ఓ విన్నపం చేశాడు.

'నేను ఈ మ్యాచ్ సమయంలో కాస్త ఒత్తిడికి గురయ్యా. మిగతా సమయాల్లో కంటే అదనంగా టెన్షన్ పడ్డా. ఈ మ్యాచ్ సవాళ్లు విసురుతుందని తెలుసు. రోజర్ ఫెదరర్ (Roger Federer) రికార్డును సమం చేయడం గొప్పగా భావిస్తున్నా. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఓ విజ్ఞప్తి.


ఆ '106'వ విజయం కోసం మా ఇద్దరి మధ్య మ్యాచ్ నిర్వహించాలని ప్రపోజ్ చేస్తున్నా'' అని జకోవిచ్ వ్యాఖ్యానించాడు.

వింబుల్డన్ (Wimbledon 2026) మూడో రౌండ్‌లో జకోవిచ్ 7–5, 6–4, 1–6, 7–6 తేడాతో ఫ్రాన్స్ ఆటగాడు రిండర్‌నెచ్‌పై విజయం సాధించాడు.

ఇక నాలుగో రౌండ్‌లో రష్యా ఆటగాడు రోమన్ సఫిల్లిన్‌తో జకో తలపడతాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ జనిక్ సినర్ కూడా నాలుగో రౌండ్‌కు చేరాడు. జపాన్‌కు చెందిన షింటారో మోచిజుకితో సినర్ నాలుగో రౌండ్‌లో తలపడతాడు.

## ఇంగ్లాండ్ ఆటగాళ్లకు వయాగ్రా..!

ఫిఫా ప్రపంచ కప్ ఇప్పుడు ప్రిక్వార్టర్స్ దశకు చేరుకుంది. హేమాహేమీ జట్లన్నీ రౌండ్ 16 కోసం సిద్ధమవుతున్నాయి. కప్పు ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్ .. సహ ఆతిథ్య జట్టు మెక్సికోతో ప్రిక్వార్టర్స్‌లో తలపడనుంది. ఈ క్రమంలో ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ ఆటగాళ్లు వయాగ్రా తీసుకునేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు.



ఇందుకు అక్కడి వాతావరణ పరిస్థితులే కారణంగా తెలుస్తోంది. ఇంగ్లాండ్ – మెక్సికో మ్యాచ్ ఎస్టాడియా అజ్టెకా స్టేడియం వేదికగా జులై 6న జరగనుంది. ఇది మెక్సికో సిటీలో ఉన్న మైదానం. సముద్ర మట్టానికి దాదాపు 7,350 అడుగుల ఎత్తులో ఉంటుంది. దీంతో ఆటగాళ్లు తొందరగా అలసటకు గురయ్యే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు ఆటగాళ్లు వయాగ్రా వాడతారు. అయితే, దీనికి అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థతో పాటు ఫిఫా నిర్వాహకుల నుంచి అనుమతి తప్పనిసరి. తమ ఆటగాళ్లు వయాగ్రా వాడేందుకు అనుమతి ఇవ్వాలని ఇంగ్లాండ్ మేనేజర్ థామస్ టచెల్ విజ్ఞప్తి చేశారు. దీనికి ఫిఫా నుంచి అనుమతి లభించింది. ప్రస్తుతం ప్రపంచ కప్‌లో మెక్సికో అజేయంగా ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ గెలిచింది. అజ్టెకా స్టేడియం మెక్సికోకు బాగా కలిసొస్తుంది. ఇక్కడ వారిని ఓడించడం తేలికేం కాదు. సొంత ప్రేక్షకుల మధ్య ఈ జట్టు చెలరేగుతుంది. ఈ స్టేడియంలో ఇప్పటి వరకు 89 మ్యాచులు ఆడిన మెక్సికో కేవలం రెండింట్లోనే ఓడింది. అదీనూ చివరిసారిగా 2013లో పరాజయం చవిచూడటం గమనార్హం. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్ వద్ద మెక్సికోను ఓడించే వ్యూహాలు ఉంటాయనడంలో సందేహం లేదు.

# ప్రిక్వార్టర్స్ పోరు ఎవరెవరికంటే?

ఫిఫా ప్రపంచ కప్ కీలక దశకు చేరుకుంది. మొత్తం 48 జట్లు బరిలోకి దిగగా.. ప్రస్తుతం 16 టీమ్‌లు కప్పు కోసం పోటీ పడుతున్నాయి. లీగ్ స్టేజ్, రౌండ్ 32 నుంచి పదహారేసి చొప్పున జట్లు ఇంటిముఖం పట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకైతే కాబో వెర్డ్ మాత్రమే సంచలన ఆటతో నాకౌట్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. అయితే, రౌండ్–32లో అర్జెంటీనాపై పోరాడి ఓడింది. మరి ప్రిక్వార్టర్స్‌లో ఏమైనా అద్భుతాలు జరుగుతాయేమో చూడాలి..! రౌండ్–16లో గెలిచిన టీమ్‌లు క్వార్టర్స్‌కు చేరుకుంటాయి. అక్కడ్నుంచి సెమీస్.. ఆపైన ఫైనల్‌కు వెళ్లి కప్పు కోసం పోటీపడుతాయి. ఈ 16 జట్లలో దేన్నీ తక్కువగా అంచనా వేయడా



నికి వీల్లేదు. లీగ్ స్టేజ్‌లో మెరుగైన ఆటతీరు ప్రదర్శించే ఇక్కడి వరకూ వచ్చాయి. మరి ఏ జట్టు ఎవరితో పోటీ పడనుందో చూద్దాం.. భారత కాలమానం ప్రకారం ఆయా సమయాలు ఇలా..

కెనడా VS మొరాకో: జులై 4 (రాత్రి 10.30 గంటలకు)
పరాగ్వే VS ఫ్రాన్స్: జులై 5 (తెల్లవారుజామున 2.30 గంటలకు)
బ్రెజిల్ VS నార్వే: జులై 6 (తెల్లవారుజామున 1.30 గంటలకు)
మెక్సికో VS ఇంగ్లాండ్: జులై 6 (ఉదయం 5.30 గంటలకు)
పోర్చుగల్ VS స్పెయిన్: జులై 6 (అర్ధరాత్రి 12.30 గంటలకు – తెల్లవారితే జులై 7)
అమెరికా VS బెల్జియం: జులై 7 (ఉదయం 5.30 గంటలకు)
అర్జెంటీనా VS ఈజిప్ట్: జులై 7 (రాత్రి 9.30 గంటలకు)
స్విట్జర్లాండ్ VS కొలంబియా: జులై 8 (తెల్లవారుజామున 1.30 గంటలకు)
జులై 10 నుంచి 12 వరకు క్వార్టర్ ఫైనల్స్ జరుగుతాయి.
జులై 15న తొలి సెమీస్, జులై 16న రెండో సెమీస్.. జులై 19న మూడో స్థానం కోసం ప్లేఆఫ్ జరుగుతుంది.
జులై 20న ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

## శ్రేయస్ 'మాస్టర్‌క్లాస్' ఇన్నింగ్స్.. : పార్థివ్ పటేల్

ఐర్లాండ్‌తో తొలి రెండు టీ20ల్లో విఫలమైన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ .. ఇంగ్లాండ్‌తో మ్యాచ్ చెలరేగాడు. ఓ వైపు వికెట్లు పడినా సరే.. దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌పై టీ20ల్లో హాఫ్



సెంచరీ చేసిన టీమ్‌ఇండియా బ్యాటర్‌గా నిలిచాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ దూకుడుగా ఆడుతున్నప్పుడు శ్రేయస్ యాంకర్ పాత్ర పోషించాడు. శ్రేయస్ కెరీర్‌లో ఇదొక మాస్టర్‌క్లాస్ ఇన్నింగ్స్‌గా నిలిచిపోతుందని మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వ్యాఖ్యానించాడు. 'శ్రేయస్ అయ్యర్ ఆటతీరుపై ప్రశ్నలు లేవనెత్తినవారు ఈ ఇన్నింగ్స్ తర్వాత చాలా ఉపశమనం పొంది ఉంటారు. ప్లేయర్‌గా శ్రేయస్ దేని గురించీ ఆందోళన చెందక్కర్లేదు. అతడు ఈ ఫార్మాట్‌లో నిరూపించుకొన్న ఆటగాడు. అయితే, ఐర్లాండ్‌తో విఫలమైన తర్వాత.. చాలా విమర్శలు ఎదుర్కొన్నాడు. కాబట్టే, ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లు అతడికి చాలా కీలకం. తొలి టీ20ల ఆడిన తీరు అద్భుతం. ఆరంభంలోనే రెండు వికెట్లు పడిన తర్వాత.. దూకుడుగా ఆడే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. మరీ ఎక్కువగా సిక్స్‌లపై ఆధారపడకుండా యాంకర్ పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఆడిన అనుభవంతో ప్రతి భారత క్రికెటర్ సిక్స్‌లు కొట్టేందుకే అలవాటై ఉంటాడు. దాన్నుంచి శ్రేయస్ బయటపడ్డాడు. స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ.. కేవలం ఫోర్లతోనే స్కోరు బోర్డును నడిపించాడు. అందుకే అతడి కెరీర్‌లో ఇది మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్ అని చెబుతా'' అని పార్థివ్ తెలిపాడు. 'వైభవ్ సూర్యవంశీకి తప్పకుండా ఈ సిరీస్‌లో అవకాశం వస్తుందని అనుకుంటున్నా. అయితే, ఇక్కడ సరైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం.

# వుదయం సినిమా MOVIE TIME!

## మెగాసువర్మను హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం చేస్తున్న 'మాన్విక క్రియేషన్'



**వుదయం సినిమా** నూతన నటి మెగాసువర్మను హీరోయిన్‌గా తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేస్తూ మాన్విక క్రియేషన్ బ్యానర్‌పై ఓ హారర్ కాన్సెప్ట్ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను చిత్ర బృందం త్వరలో అధికారికంగా ప్రకటించనుంది. ఈ చిత్రాన్ని డి. మోహన్ నిర్మిస్తుండగా, కొమరం సూర దర్శకత్వం వహిస్తున్నారు. ఎల్. చరణ్ హీరోగా నటిస్తుండగా, మెగాసువర్మతో పాటు లాస్య, ప్రశాంతి, జోత్స్న కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బెజవాడ కృష్ణ కాస్టింగ్ సర్వీసు నుంచి మెగాసువర్మ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. హారర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా కథ ఆసక్తికరంగా సాగనుంది. రీసెర్చ్ కోసం ప్రయాణానికి వెళ్లిన నలుగురు యువతులు ఒక క్యాబ్ డ్రైవర్‌ను బుక్ చేసుకుంటారు. ఆ ప్రయాణంలో చోటుచేసుకునే ఊహించని సంఘటనలు, వారు గతంలో ఎదుర్కొన్న భయానక అనుభవాలతో ఎలా ముడిపడ్డాయి? ఆ ప్రమాదకర పరిస్థితుల నుంచి వారు ఎలా బయటపడ్డారు? అనే అంశాల చుట్టూ కథ నడుస్తుంది. ఈ చిత్రంలో 'భరత్ అనే నేను' చిత్రంలో గుర్తింపు పొందిన శుభోదయం సుబ్బారావు (రాజశేఖర్), చరణ్, పొట్టి మామ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూలై 5 నుంచి ప్రారంభం కానుంది.

## ప్రపంచ దిగ్గజ దర్శకుల సరసన రాజమౌళి



**వుదయం సినిమా :** మన తెలుగు సినిమా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి గ్లోబల్ వేదికపై మరో అరుదైన మైలురాయిని అందుకున్నారు. ఫ్రాన్స్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన లూమియర్ మ్యూజియంలో ఆయనకు అపురూప గౌరవం దక్కింది. ప్రపంచ చలనచిత్ర రంగానికి దిక్సూచిగా నిలిచిన లెజెండరీ దర్శకుల సరసన జక్కన్న పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా అక్కడ ప్రత్యేక ఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవలే ఫ్రాన్స్ వెళ్లిన రాజమౌళి.. లూమియర్ మ్యూజియంతో పాటు గతంలో తన 'ఈగ', 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాలను ప్రదర్శించిన స్క్రీనింగ్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ డైరెక్టర్ థియరీ ఫ్రేమో స్వయంగా రాజమౌళిని ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత జక్కన్నకు ఒక ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చారు. మార్టిన్ స్కోర్సెసీ, క్లింట్ ఈస్ట్‌వుడ్, క్వెంటిన్ టరంటినో వంటి హాలీవుడ్ క్లాసిక్ లెజెండరీ డైరెక్టర్ల నేమ్ బోర్డులు ఉండే 'మ్యూర్ డే సినియాస్ట్' (ఫిల్మ్ మేకర్స్ వాల్) వద్దకు రాజమౌళిని తీసుకెళ్లారు. అక్కడ ఎర్రటి వస్త్రంతో కప్పి ఉన్న ఫలకాన్ని తొలగించగా.. ప్రపంచ సినిమా దిగ్గజాల పేర్ల పక్కన 'ఎస్. ఎస్. రాజమౌళి' అనే పేరు సగర్వంగా మెరిసిపోయింది. ఈ చారిత్రక క్షణాన్ని చూసి రాజమౌళి ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. ఇది తనకు జీవితాంతం గుర్తుండిపోయే అద్భుత జ్ఞాపకమని, ఈ గౌరవాన్ని ఎప్పటికీ మరువలేనని ఆయన సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. అసలు సినిమా రూపాన్నే కనిపెట్టిన లూమియర్ బ్రదర్స్ జ్ఞాపకార్థం ఫ్రాన్స్‌లోని లియాన్ నగరంలో ఈ 'లూమియర్ మ్యూజియం'ను నిర్మించారు. ప్రపంచ చలనచిత్ర చరిత్రలోనే దీనిని అత్యంత పవిత్రమైన స్థలంగా భావిస్తారు. ఇప్పుడు అలాంటి చారిత్రక ప్రదేశంలో, హాలీవుడ్ అగ్ర దర్శకులతో సమానంగా మన తెలుగు దర్శకుడి పేరు శాశ్వతంగా నిలిచిపోవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమకే కాకుండా, యావత్ దేశానికి గర్వకారణంగా నిలిచింది.



## ఏళ్ల తరబడి గుర్తుండిపోతుంది 'చెన్నయ్ లవ్ స్టోరీ' - కిరణ్ అబ్బవరం

**వుదయం సినిమా** విజయవాడలో ప్రేక్షకుల కేరింతల మధ్య హీరో కిరణ్ అబ్బవరం "చెన్నై లవ్ స్టోరీ" మూవీ లవ్ కార్నివాల్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్ లో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జనసేన పార్టీ నుంచి పంచకర్ల సందీప్ అతిథిగా హాజరయ్యారు. రాజ్ యువరాజ్ థియేటర్ లో జరిగిన ఈ ఈవెంట్ లో "చెన్నై లవ్ స్టోరీ" సినిమా నుంచి నాలుగో లిరికల్ సాంగ్ 'హొయిలా హొయిలా' రిలీజ్ చేశారు. ఈ గ్రాండ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ "చెన్నై లవ్ స్టోరీ" సినిమా ఫస్ట్ ప్రమోషనల్ ఈవెంట్ తిరుపతిలో చేశాం. ఈ ఈవెంట్ వైజాగ్ లో చేయాల్సిఉండేది. వర్షం కారణంగా విజయవాడకు వెన్యూ మారింది. ఈవెంట్ మా సొంతూరు విజయవాడకు రావడం నాకు హ్యాపీగా అనిపిస్తోంది. తెలుగులో ఎన్నో ప్రేమ కథలు చూశాం. కానీ "చెన్నై లవ్ స్టోరీ" ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది. ఈ నెల 24న మా మూవీలోని మ్యాజిక్ తెరపై చూస్తారు. ఈ సినిమా కోసం కిరణ్ అబ్బవరం చాలా కష్టపడతున్నారు. 60 గంటలు నాన్ స్టాప్ గా షూటింగ్ చేశారు. గత పది రోజులుగా రెస్ట్ తీసుకోవడం లేదు. అందుకే ఆయనను కిరణ్ బంగారం అని పిలవాలని అనిపిస్తుంటుంది. మా హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ ఈ చిత్రంతో మరింత మంచి పేరు తెచ్చుకుంటుంది. రవి నంబూరి కొత్త దర్శకుడిగైనా సినిమాను బాగా తెరకెక్కించారు. ఆయన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ బిజీలో ఉండి ఈవెంట్ కు రాలేకపోయారు. నా విజయాల వెనక నా స్నేహితులు సాయి రాజేశ్, ఎస్ కేఎన్ ఎప్పుడూ ఉంటారు. అన్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ విజయవాడ అంటే నాకు చాలా ఇష్టం. మా మూవీ ఈవెంట్ ఇక్కడ మీ మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది. "చెన్నై లవ్ స్టోరీ" సినిమాలోని పాటలను, టీజర్ ను ఇక్కడ మీ మధ్య చూస్తుంటే ఎమోషనల్ గా అనిపించింది. ఈ సినిమా కోసం మేము ఏడాదిన్నరగా కష్టపడుతున్నాం. మరో 20 రోజుల్లో సినిమా మీ ముందుకు రాబోతోంది. ఈ నెల 24న మళ్లీ ఇదే థియేటర్ లో మనమంతా కలుసుకుందాం. స్టీవెన్, నిధి ప్రేమ కథ మామూలుగా ఉండదు. స్టీవెన్ , నిధి ఇద్దరూ మీ అందరికీ బెస్ట్ ఫ్రెండ్స్ అవుతారు. ఈ చిత్రంలో కిరణ్ తో కలిసి నటించడం లవ్ లీ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. అన్నారు. జనసేన పార్టీ నేత పంచకర్ల సందీప్ మాట్లాడుతూ "చెన్నై లవ్ స్టోరీ" సినిమా పేరులోనే చెన్నై ఉందిగానీ ఎక్కువ షూటింగ్ మన చీరాల బీచ్ లోనే చేశారు.

## వింటేజ్ స్పై థ్రిల్లర్‌గా '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'



**వుదయం సినిమా :** ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' టీమ్... మీడియాకు టీజర్‌ని ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో సినిమాలో నటించిన ఇతర నటీనటులతో పాటు డా. శివరాజ్‌కుమార్, డాలీ ధనంజయ, ప్రియాంక మోహన్, అదితి బాలన్, దర్శకుడు హేమంత్ ఎం.రావు, నిర్మాత వైశాక్ జె గౌడ, ఛాయాగ్రాహకుడు అద్వైత గురుమూర్తి, సంగీత దర్శకుడు చరణ్ రాజ్, ప్రొడక్షన్ డిజైనర్ విశ్వాస్ కశ్యప్ పాల్గొన్నారు. టీజర్‌లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' మూవీ వరల్డ్‌ని అద్భుతంగా చూపించారు. చిత్రాన్ని స్పై డ్రామాగా తెరకెక్కించారు. లెజెండరీ డా.రాజ్‌కుమార్ 'సీఐడీ999'ని గుర్తుచేస్తూ, నివాళులర్పించేలా ఉంది టీజర్. సినిమా జరిగే సమయం, మిషన్, అనుభవం ఉన్న ఏజెంట్, వృద్ధిలోకి రావాలనుకుంటున్న ఏజెంట్, మాస్క్ మేన్, వాళ్ల కళ్లు గప్పే చెడ్డ వ్యక్తి, అందమైన తల్లి కథ.. ఆఖరిలో ధనంజయ ఇచ్చే ట్విస్టు.. టీజర్‌లో ప్రతిదీ ఆకట్టుకుంటోంది. డా. శివరాజ్‌కుమార్ ఇందులో ఏజెంట్ ప్రకాష్‌గా కనిపించారు. స్క్రీన్ మీద ఫైర్ పుట్టించే ఆయన ప్రెజెన్స్ హైలైట్. అందులోనూ ఏజెంట్‌కి ఉండాల్సిన మోస్ట్ డేంజరస్ వెపన్ దృష్టి. శివరాజ్‌కుమార్ కళ్లు పర్ఫెక్ట్ గా అందుకు సూట్ అయ్యాయి. టీజర్ ఆఖరిలో ధనంజయను చూసే వరకు, ఆయన పనిలో ఎదుర్కొనే సవాళ్లు మెప్పిస్తాయి. ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడానికి కావాల్సినన్ని విశేషాలున్నాయి టీజర్‌లో. అద్వైత గురుమూర్తి, విశ్వాస్ కశ్యప్ సెటప్ చేసిన వరల్డ్ కనువిందుగా ఉంది. ఊహల నుంచి విజువల్స్ దాకా విశ్వాస్ పనితీరును ప్రశంసించాల్సిందే. ఏ ఒక్క ఫ్రేమ్‌లోనూ సినిమా కోసం తీర్చిదిద్దారనే భావన కలగనివ్వలేదంటే, పనితీరు ఎంత బావుందో అర్థం చేసుకోవచ్చు. కథను విజువల్ పెయింటింగ్‌గా తీర్చిదిద్దారు అద్వైత గురుమూర్తి. గతాన్ని స్క్రీన్స్ మీదకు తీసుకురావడంలో ఆయన కృషి అభినందనీయం. హృద్యమైన కవిత్వాన్ని తెరమీద చూసినంత అందంగా తీర్చిదిద్దారు.

## తండ్రి వారసత్వాన్ని అందుకుంటున్న ఆర్యన్ రాజేష్

### 'ఈవీవీ సినిమా'లో న్యూ ఏజ్ లవ్ స్టోరీ!



**వుదయం సినిమా :** లెజెండరీ డైరెక్టర్ ఈవీవీ సత్యనారాయణ తన ఇద్దరు కుమారుల కెరీర్ విషయంలో వేసుకున్న ప్రణాళికలు వేరు.. కానీ కాలక్రమేణా జరిగింది వేరు. పెద్ద కుమారుడు ఆర్యన్ రాజేష్ లుక్స్ పరంగా చక్కగా ఉంటాడని భావించి, అతడిని హీరోగా నిలబెట్టాలని ఈవీవీ ఆకాంక్షించారు. మరోవైపు చిన్న కుమారుడు అల్లరి నరేష్‌ను హీరోగా చేయడం కంటే, తన వారసత్వాన్ని అందిపుచ్చుకుని దర్శకుడిగా స్థిరపడాలని కోరుకున్నారు. అందుకు తగ్గట్టుగానే నరేష్ తొలుత తన తండ్రి వద్ద కొన్ని చిత్రాలకు దర్శకత్వ శాఖలోనూ పని చేశారు.

కానీ కాలం వారి దారులను మార్చేసింది. 'హాయ్' చిత్రంతో కథానాయకుడిగా పరిచయమైన ఆర్యన్ రాజేష్‌కు ఆశించిన స్థాయిలో విజయాలు దక్కలేదు. ఆ తర్వాత 'ఎవడి గోల వాడిది' లాంటి హిట్లు పడినా, కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడలేదు. దీంతో ఆయన క్రమంగా నటనకు దూరమయ్యారు. కాగా, అల్లరి నరేష్ మాత్రం హీరోగా టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసి, సుదీర్ఘ కాలంగా పరిశ్రమలో కొనసాగుతున్నారు.

ఇదిలా ఉంటే, సుదీర్ఘ విరామం తర్వాత ఆర్యన్ రాజేష్ సరికొత్త రూపంలో ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుండడం విశేషం. తన తండ్రి నెలకొల్పిన ప్రతిష్ఠాత్మక 'ఈవీవీ సినిమా' బ్యానర్‌ను ఆయన మళ్లీ వెలుగులోకి తెస్తున్నారు. గతంలో ఈ సంస్థపై 'చాలా బాగుంది' వంటి పలు విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. ఈవీవీ దర్శకత్వంలో అల్లరి నరేష్ హీరోగా వచ్చిన 'ఫిట్టింగ్ మాస్టర్' తర్వాత ఈ బ్యానర్‌లో సినిమాలు రాలేదు. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత ఆర్యన్ రాజేష్ నిర్మాతగా ఈ సంస్థలో కొత్త సినిమాను పట్టాలెక్కించారు.

అయితే, ఈ చిత్రంలో అల్లరి నరేష్ హీరో కాకపోవడం గమనార్హం. 'కోర్ట్' సినిమాతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హర్ష్ రోషన్ ఇందులో లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ న్యూ ఏజ్ లవ్ స్టోరీ ద్వారా ప్రియాంక అచ్చర్ కథానాయికగా పరిచయమవుతుండగా, కొత్త దర్శకులు అరుణ్‌బాలాజీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల 'బ్యాండ్ మేళం' సినిమాతో పరాజయం చవిచూసిన హర్ష్ రోషన్‌కు, నిర్మాతగా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఆర్యన్ రాజేష్‌కు ఈ చిత్రం ఎంతవరకు పునర్వైభవాన్ని తెచ్చిపెడుతుందో వేచి చూడాలి.

## రెడీ అవుతున్న "కిల్లర్"



**వుదయం సినిమా :** జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ "కిల్లర్". మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. వీఎఫ్ఎక్స్ వర్క్స్ సహా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. సూపర్ టాలెంటెడ్ హీరోయిన్ జ్యోతి పూర్వజ్ బర్త్ డే సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ "కిల్లర్" చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో సూపర్ వుమెన్ గా, మిస్టీరియస్ వుమెన్ గా జ్యోతి పూర్వజ్ ఎలక్ట్రిఫైయింగ్ లుక్స్ లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. మెలిఫిసెంట్ మూవీలో ఏంజెలీనా జోలిని తలపించేలా జ్యోతి పూర్వజ్ లుక్స్ ఉండటం విశేషం. "కిల్లర్" సినిమాలో సూపర్ షీ క్యారెక్టర్ లో జ్యోతి పూర్వజ్ నటన ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేయనుంది. "కిల్లర్" సినిమాలో ప్రేక్షకులు మర్చిపోలేని ఒక ప్రపంచాన్ని డైరెక్టర్ పూర్వాజ్ క్రియేట్ చేస్తున్నారు. ఆయన ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు సీఎన్ఏ ఇంటిగ్రేషన్, రాయ్ ప్రోటోకాల్ కోసం వర్క్ చేసే సైంటిస్ట్ గా కనిపించబోతున్నారు. "కిల్లర్" సినిమా ప్రోగ్రెస్ గురించి డైరెక్టర్ పూర్వాజ్ మాట్లాడుతూ మా "కిల్లర్" సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. భారీ వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉండటం వల్ల కొంచెం ఎక్కువ సమయం పట్టింది. ఇప్పుడు వీఎఫ్ఎక్స్ వర్క్స్ కూడా పూర్తయ్యాయి. మరోవైపు బిజినెస్ టాక్స్ జరుగుతున్నాయి. ఇండస్ట్రీలోని పలువురు టాప్ డిస్ట్రిబ్యూటర్స్, బయ్యర్స్ మా ప్రొడ్యూసర్స్ తో కలిసి సినిమా చూశారు. సినిమా ఔట్ పుట్ పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.



## మా సిరీస్ ఫ్యామిలీ అందరికీ నచ్చేస్తోంది

**వుదయం సినిమా :** విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా శరత్ చంద్ర నాయుడు నిర్మించిన సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. ఈ సిరీస్‌ను వినోద్ గాలి తెరకెక్కించారు. రోహిణి హట్టంగడి, శివ నారాయణ నరిపెద్ది, ప్రియదర్శిని రామ్, గోపరాజు రమణ, వివా రాఘవ, పవన్ సిద్ధు, గోదావరి గోపి, అనీష్ కురువిల్లా, మేఘన సునీల్, గఫూర్, మధు స్టీవ్, రామ్ చరణ్, చక్రి, సైమన్ తదితరులు ఈ సిరీస్‌లో ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సిరీస్ ప్రస్తుతం ఈటీవీ విన్‌లో సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలో విజయోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన సక్సెస్ మీట్‌లో.. విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ .. "నేను కొత్తగా ప్రయత్నించిన ప్రతీ సారి తెలుగు ఆడియెన్స్ నన్ను సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌కి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో అని చాలా భయపడ్డాను. కానీ సిరీస్ బయటకు వచ్చాక.. అందరూ ఫోన్స్ చేసి ప్రశంసిస్తున్నారు. నవ్వాం, ఏడ్చాం.. ఇలాంటి పాత్రను చేసినందుకు థాంక్స్ అని నాతో చెప్పి పొగుడుతున్నారు. మాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మాకు అండగా నిలిచిన బాపినీడు గారికి థాంక్స్. శరత్ గారు ఈ ప్రాజెక్ట్‌ని ఇష్టపడి కాదు, ప్రేమించి చేశారు. ఆయనకు ఇదొక గొప్ప ఆరంభం. వినోద్ గారు ఈ సిరీస్ కోసం దాదాపు రెండేళ్లు కష్టపడ్డారు. సాయి గారు, భరణ్ గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. రాజశేఖర్ మంచి కథను మాకు ఇచ్చారు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన సిద్ధు, గోపీ, రాఘవ్‌లకు థాంక్స్. యశశ్రీ మాకు చాలా సపోర్ట్ చేశారు. చైల్డ్ ఆర్టిస్ట్స్ అందరూ అద్భుతంగా నటించారు. ఎడిటర్ శ్రీధర్ గారు మా సిరీస్‌ను ఇష్టపడ్డారు కాబట్టే ఇంత గొప్పగా ఎడిట్ చేశారు. అజయ్ గారు ఉంటే మ్యూజిక్ పరంగా నేను కాన్ఫిడెంట్‌గా ఉంటాను. మంచి పాటను ఇచ్చిన సుహాస్ గారికి థాంక్స్. మా సిరీస్ ఫ్యామిలీ అందరికీ నచ్చేస్తోంది. మా సిరీస్‌ను సపోర్ట్ చేస్తున్న ఆడియెన్స్‌కి థాంక్స్' అని అన్నారు.

నిర్మాత శరత్ చంద్ర నాయుడు మాట్లాడుతూ .. "ఏడాదిన్నర పాటుగా ఈ 'గుర్తుకొస్తున్నాయి' మా నిద్రలేని రాత్రుల్లో, మా చర్చల్లో ఉంది. కానీ ఇప్పుడు ప్రతీ ఒక్కరి గుండెల్లో ఉంది. చూసిన ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. చాలా ఏళ్ల తరువాత ఓ మంచి సిరీస్ చూశామని అంటున్నారు. వినోద్ నాకు సొంత బ్రదర్‌లాంటి వాడు.

## 'ఓ..! సుకుమారి' గంగా ఎంటర్టైన్మెంట్స్

## 'ప్రేమ ప్రేమిస్తున్నా' సాంగ్ రిలీజ్



**వుదయం సినిమా :** యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ జంటగా నటించిన విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ..! సుకుమారి'. భరత్ దర్శన్ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. జూలై 17న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో చిత్రం నుంచి 'ప్రేమ.. ప్రేమిస్తున్నా' అనే రొమాంటిక్, మెలోడీ పాటను విడుదల చేశారు. ఈ పాటను జేమ్స్ టకారా ఆలపించారు. పూర్ణాచారి లిరిక్స్ ఎంతో చక్కగా ఉన్నాయి. ఈ పాటకు సంబంధించిన లిరికల్ వీడియో అందరినీ ఆకట్టుకునేలా ఉంది. విలేజ్ వాతావరణం, హీరో హీరోయిన్ ట్రాక్, సింపుల్ కొరియోగ్రాఫీ పాటను అందంగా మలిచింది. రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.
Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.